# శివానంద భారతి

దివ్య జీవన ఆధ్యాత్మిక, సాంస్కృతిక మాసపత్రిక

**Sivananda Bharathi**

**Spiritual Monthly Magazine**

**Vol :16 Edition: 12** సంపుటి: 16 సంచిక: 12 శ్రీవిళంబి: భాద్రపదం ఆశ్వయుజం అక్టోబరు – 2018 **October - 2018**


**బ్రహ్మలీనులు పరమపూజ్యులు, శ్రీ స్వామి శివానంద, శ్రీ స్వామి చిదానంద, శ్రీ స్వామి దేవానంద ఆశీస్సులతో**


వ్యవస్థాపకులు :
**బ్రహ్మలీన స్వామి సత్యవ్రతానంద**

సంపాదకులు :
**ఆచార్య కసిరెడ్డి**

సహ సంపాదకులు :
**తిప్పరాజు కొండల్‌రావు**

సంపాదక మండలి :
**బొప్పన అరుణాదేవి**
**జి. సుధీర్‌కుమార్**
**డా॥ భేరీ సునీత**
**మరీచిక**


**శివానంద భారతి చందా వివరాలు.** సంవత్సరం చందా రూ. 100/- శాశ్వత చందా రూ. 1100/-. సంవత్సర చందా కన్నా ఎక్కువ పంపరాదు. శాశ్వత చందా, పత్రిక నడచినంత కాలం అని గ్రహించగలరు.

## విషయసూచిక


| | |
|---|---|
| ఆత్మీయ భారతి – ధర్మం గెలవాలి – ఆశ్రమ కార్యవర్గం | 4 |
| సంపాదక భారతి – హిందుత్వ జాగరణంలో..– ఆచార్య కసిరెడ్డి | 5 |
| హిందూ ధర్మ సమగ్ర స్వరూపం – స్వామి శివానంద | 10 |
| భావ పరిణతి – మానవ జీవితం – స్వామి సర్వవిదానంద | 15 |
| శ్రీ రమణతత్త్వము – బొప్పన అరుణాదేవి | 19 |
| గురుదేవుల నిజమైన ... – అను. తిప్పరాజు కొండల్‌రావు | 22 |
| విజయీ భవ ! – ఆచార్య కసిరెడ్డి | 27 |
| గావోహి విశ్వస్య యోగ మాతరః – యోగరత్న డా॥ శశిరేఖారెడ్డి | 29 |
| భజన భారతి – స్వామిని శారదా ప్రియానంద | 30 |
| ప్రార్థన భారతి – ఆచార్య కసిరెడ్డి | 31 |
| జీవుడా మేలుకో ! – బ్రహ్మలీన శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వామి | 32 |
| ప్రపంచంలోని ప్రధాన మతాలు .. – ఆకుల రామయ్య | 34 |
| నారాయణీయం – శ్రీమతి హేమలతా బాలసుబ్రహ్మణ్యం | 36 |
| బతుకమ్మా ! బతుకమ్మా ! – ఆచార్య కసిరెడ్డి | 40 |
| **Purpose and Goal of Life** - Swami Chidananda | 44 |
| **Mahaan Srimad Appayya ..** - Sivananda Muthuraman | 47 |
| విజయవంతమైన .... – ఆచార్య వంగపల్లి విశ్వనాథం | 53 |
| ప్రకటన భారతి | 54 |
| వార్తా భారతి | 55 |
| విశేష భారతి | 58 |



**ఆయా రచయితల అభిప్రాయాలు వారివే. ఆశ్రమ పత్రిక ఆలోచనా మాధ్యమం మాత్రమే.**

**ఆత్మీయ భారతి**

సేవించు, ప్రేమించు,
ధ్యానించు-సాక్షాత్కారం పొందు

**ధర్మం అంటే!**

**శ్లో॥ ధృతిః, క్షమా, దమో, అస్తేయం - శౌచమింద్రియ నిగ్రహః ।**
**ధీర్విద్యా సత్యమక్రోధో - దశకం ధర్మలక్షణమ్ ॥** (మనుస్మృతి)

తా॥ ధైర్యం, సహనం, నిగ్రహం, దొంగతనం చేయకుండడం, శుభ్రత, ఇంద్రియాదులకట్టడి, బుద్ధి, విద్యా, సత్యం, అక్రోధం ఈ పది ధర్మ లక్షణాలు.

**ధర్మపథం - భారతం**

**కం॥ ఒరులేయవి యొనరించిన - నరవర ! అప్రియము తన మనంబునకగు, తా**
**నొరులకు నవి సేయకునికి - పరాయణము పరమ ధర్మపథములకెల్లన్**

తా॥ ఇతరులు ఏది చేసినచో మన మనస్సునకు కష్టము కలుగునో, ఆ పని మనము ఇతరులకు చేయకూడదు. ధర్మమార్గములలో కెల్ల ఇదే గొప్పది. **- భారతం**

# ధర్మం గెలవాలి

దేశంకోసం, ధర్మంకోసం పనిచేసే కాషాయ వస్త్రధారులైన పరిపూర్ణ స్వాములెందరో ఈ దేశంలో ఉన్నారు. డేరా బాబాలు, రాంలాల్లు, సత్యానందలూ ఉన్నారు. సన్యాస స్వీకారార్హత లేనివారు సన్యాసులు కారాదు. అలాంటి వారు హిందుత్వానికి చీడపురుగుల్లా నిలిచిపోతారు. అర్థపరచిత్తులు, కామోప భోగవిలాస జీవనులు, అధికారమత్తులూ సన్యాసం స్వీకరించరాదు. ఎవరైనా ఇది గుర్తుంచుకొని చతుర్విధ పురుషార్థాలను అర్థంచేసుకొని జీవించాలి.

అలా జీవించిన వ్యాస వాల్మీకాదులు పురాణ యుగంలో, ఆదిశంకర రామానుజాదులు మధ్య యుగాల్లో, వివేకానంద, శివానంద స్వామి, రామతీర్థ, మలయాళ స్వామి తదిరులు సమకాలీన ప్రపంచంలో మనకు ఆదర్శం. ఆ కోవకు చెంది సమాజ సేవ చేస్తూ, ఆధ్యాత్మిక వికాసానికి శ్రమిస్తున్న శ్రీ పరిపూర్ణనంద స్వాముల వారిని తెలంగాణ ప్రభుత్వం అరెస్టు చేసింది. చివరికి న్యాయదేవత తీర్పుతో ధర్మానికి న్యాయం జరిగింది. ఈ విధంగా ధర్మానికి న్యాయానికి అండగా నిలబడ్డ వారు ఎప్పుడూ విజయం సాధిస్తారని గుర్తించాలి. చతుర్విధ ఆశ్రమాలలో ఉన్న వారు ధర్మబద్ధంగా వ్యవహరించిన్నాడు దేశం అభ్యుదయ మార్గంలో నడుస్తుంది. ముమ్ముందు ఈ మార్గం సుగమం అవుతుందని భావిద్దాం !

ధన్యవాదాలతో . . .

**శ్రీ శివానందాశ్రమం**
పద్మారావునగర్, సికింద్రాబాద్
01-10-2018

భవదీయ
**ఆశ్రమ కార్యవర్గం**
**శివానంద భారతి, సంపాదక మండలి**

సంపాదక భారతి

# హిందుత్వ జాగరణంలో మనమేం చేయాలి ?

హిందుత్వం ప్రమాదంలో ఉంది. దేశాన్నే కబళించి హిందూజాతిని హిందూదేశంలో లేకుండా చేయాలనే ఉద్దేశంతో కొన్ని విదేశీశక్తులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. ఈ సందర్భంలో ఒక వ్యక్తి, ఒక కుటుంబం, ఒక సంస్థ, ఏంచేస్తే హిందుత్వం చైతన్యశీలదిశలో నడుస్తుందో, సుస్థిరంగా ఉంటుందో ఆలోచించవలసి ఉంది. ఎవరెవరేయే వృత్తుల్లో ఉన్నా హిందూ సంఘటనకూ చైతన్యానికి నేనేంచేశాను అని ఆలోచించుకొని ఆచరణలో పెట్టవలసి ఉంది. మరి ఏ యే అంశాల్లో ఈ ఆలోచన కొనసాగించి ఈ విషయంలో క్రియాశీలురం కావల్సి ఉందో చర్చించుకొందాం !

## మన సమీపంలో గుడి ఉందా !

మనమో గ్రామంలో లేదా నగరంలో ఉన్నాం. ఆ గ్రామంలో లేదా ఆ నగరంలోని వీధిలో మనకు దగ్గరగా ఓ గుడి ఉంది. ఆ గుడి వికాసం కొరకు గుడిలో జరగాల్సిన నిత్యనైమిత్తిక కార్యక్రమాలకొరకు మనమేమైనా చేయాలి. మన పూర్వీకుల ఆలోచనల ప్రకారం అదొక అన్న సత్రంగా ఉండాలి. ఆకలి గొన్న వారికి అన్నం వ్యవస్థ ఉండాలి. ప్రసాదమే మరి కొంత ఎక్కువ పెడితే చాలు ; అన్నం పెట్టినట్లే.

అదొక ధర్మసత్రంగా ఉండాలి. నిరాశ్రయులకు ఆశ్రయమిచ్చే ధర్మసత్ర మొకటి గుడికి అనుబంధంగా ఉండాలి. గుడి అనాథనిలయంగా ఉండాలి. జగన్నాథుడు అనాధ నాథుడని, దిక్కులేని వారు ఆశ్రయిస్తే వారిని ఆదుకొనే వ్యవస్థ ఉండాలి. గుడి ఒక ప్రమాణవేదికగా ఉండాలి. న్యాయం విషయంలో అక్కడే తీర్పులు జరిగే పద్ధతి ఏర్పాటు కావాలి. గుడి ఒక ఆధ్యాత్మిక చర్చావేదిక కావాలి. మతాలు, సంప్రదాయాలు, దేశకాల పరిస్థితులనుబట్టి ఏర్పడ్డ వైరుధ్యాలు అన్నీ ఈ చర్చావేదిక ద్వారా సమన్వయింపబడాలి. వాదాల ద్వారా నీ మేమిటో తేలాలి. ఆలయం ఒక పవిత్ర వైద్యాలయంగా కూడా కనిపించాలి. దేవుని పేరిట ఎందరికో వైద్యసేవలందించాలి. ఆలయం ఒక యోగనిలయంగా కనిపించాలి.

ఎప్పటికీ తరగని మూలధనం "మంచితనం"

ప్రాణాయామాదులతో పాటు యోగం – యోగాసనాలన్నీ నేర్పబడాలి. గుడిలో ఒక ఆధ్యాత్మిక గ్రంథాలయం ఉండాలి. ఆ పుస్తకాలు మళ్ళీ ఇచ్చే ప్రాతిపదిక మీద పంపిణీ కావాలి ; అక్కడే చదువుకొనే వ్యవస్థ ఉండాలి. మూల గ్రంథాలు, పారాయణ గ్రంథాలు, వ్యాఖ్యాన గ్రంథాలు అన్నీ అందరికీ అందుబాటులో ఉండే గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసుకోవాలి. అసలు దేవాలయమే ఒక ఆధ్యాత్మిక కేంద్రంగా భాసించాలి. దేవునికి – విశ్వానికి సంబంధించిన అనేక అంశాలు శిల్ప – సంగీత – నృత్య – నాటక ప్రక్రియలలో ప్రదర్శింపబడి ఆలయం సర్వకళానిలయంగా ప్రకాశించాలి. చిన్నారులకు శ్రీకారం పెట్టించే కేంద్రమే గాక గుడేబడి అన్న విధంగా దానిని తీర్చిదిద్దుకోవాలి. అంతేకాదు అనేక కారణాలవల్ల ఆయా గృహాల్లో కాన్పులకు ఇబ్బంది ఏర్పడే పరిస్థితులు గాని ఉన్నట్లయితే గుడి ఒక ప్రసూతిశాల పాత్రను నిర్వహించాలి. ప్రతి హిందువు ఇది నా గుడి ఇది నా శ్రద్ధాకేంద్రం అనే భక్తి విశ్వాసాలతో వ్యవహరించాలి.

ప్రతి గుడి ఈ విధంగా ఉండాలని మన పూర్వీకులు ఆశించారు. కొన్ని గుళ్లు ఇందులోని అన్నిటిని కొనసాగించి సమాజాన్ని తీర్చిదిద్దే సంస్కరించే పవిత్ర కార్యంలో నిమగ్నమై ఉన్నాయి. ఈ విషయంలో మన యోగదానమైనా ఉందా ! ఇది వరకు లేకుంటే ఇప్పుడు ఇక ముందు ఈ పనుల్లో ఏదో ఒక దానికి అంకితమై గుడిని కేంద్రంగా తీసుకొని హిందూ దివ్య సమాజ నిర్మాణానికి మనం పనిచేయలేమా ! మన పనులతోపాటే ఇదీ మన పనే అని ఇప్పటికీ ఈ పనులలో లీనమై ఉన్న మనుషుల – సంస్కర్తల – కార్యకర్తల మార్గంలో మనమూ నడవలేమా ! ఇది ఈశ్వరీయకార్యంగా వ్యవహరించి యుగయుగాల హిందుత్వ జాగరణంలో మనం ఉడతాభక్తి ప్రదర్శించడానికి సంసిద్ధం కాలేమా ? ఆలోచించండి ! మన సమాజ వికాసం మన చేతుల్లోనే ఉంది.

మన సమాజం దివ్యమైంది. నలుగురం కలిసి నడవడానికి అనేక కార్యక్రమాలు మనం సామూహికంగా, నిర్వహించుకోవలసి ఉంది. తద్వారా జనజీవనంలో ఏకతాభావాల్ని నింపవలసి ఉంది. అయితే అవి ఏవేవో చూద్దాం.

## సామూహిక పారాయణాలు

భగవద్గీత, విష్ణుసహస్రనామాలు, లలితా సహస్ర నామాలు ఒకరు పారాయణం చేయవచ్చు. కుటుంబమంతా కలసి పారాయణం చేయవచ్చు. ఇరుగుపొరుగు పదిమందితో

సంఘాన్ని మార్చాలనుకుంటే ముందుగా నువ్వు మారాలి

కలిసి చేయవచ్చు ; స్త్రీలు, పిల్లలు, పురుషులు వేరు వేరుగా చేయవచ్చు ; లేదా అందరూ కలిసి పారాయణం చేయవచ్చు. ఈ పారాయణాలవల్ల కలిసి ఏకగళంగా తమ మాటను వినిపించే ఒక శక్తి వస్తుంది. ఒకరి ఇంటిలోగాని, గుడిలో గాని, సామాజిక కేంద్రంలో గాని ఈ సామూహిక పారాయణాలు చేయవచ్చు. పారాయణం తర్వాత మహాత్ములు వ్రాసిన గ్రంథాల నుండి కొన్ని పేరాలు చదవాలి. ఎవరైనా దానిమీద వ్యాఖ్యానం చేయాలి. పారాయణంవల్ల శ్రద్ధ – ఏకాగ్రత పెరుగుతుంది. మేమందరం హిందువులం అనే భావన కలుగుతుంది. విదేశాల్లో వీకెండుల్లో మనవారు పారాయణాల ద్వారా సంఘటిత శక్తిని సాధిస్తున్నారు. అక్కడవారు మైనార్టీలయినందువల్ల అలా చేస్తారండి అని కొందరంటారు. మనం వారికి ఆదర్శంగా ఉండాలి కదా ! తాత నుండి మనమడు నేర్చుకోవాలా ! మనమని నుండి తాతనా! పారాయణాలవల్ల కూడా హిందూ చైతన్యానికి దోహదం చేయవచ్చు నన్నది గుర్తించాలి.

## యజ్ఞాలు

సామూహిక పారాయణమే ఒక యజ్ఞం వంటిది. అందులో చర్చలకు తావిచ్చి సత్యాలను వెలికితీసే ప్రయత్నం చేసినప్పుడు అది జ్ఞానయజ్ఞమే అవుతుంది. అయితే యజ్ఞం అనగానే హోమగుండం ఆజ్యం, అగ్ని, ఋత్విక్కులు, యజమాని, కర్తా, భర్తా, భోక్తా అందరు మనకు గుర్తుకు వస్తారు. వీరందరు ఉన్నా లేకున్నా యజ్ఞం ఒక్కరే చేయవచ్చు. అందరిని కలుపుకొని చేయవచ్చు. కుటుంబం వారే చేయవచ్చు. ఇంటా బయటా ఎక్కడైనా సరే చేయవచ్చు.

సామూహిక యజ్ఞాల్లో ఎందరో భాగస్వాములవుతారు. ఇది మాది అనే భావన వల్ల ఏకతా నిర్మాణం జరుగుతుంది. బాహ్యాంతర ఫలితాలెన్నో లభిస్తాయి. సమాజం శక్తి మంతమవుతుంది.

## దానం - అన్నదానం

వాపీ, కూప, తటాక, ఆలయ, పథ నిర్మాణాలకు దానం చేయాలి. ప్రధానంగా అన్నదానం చేయాలి. అదీ వ్యక్తిగతంగా కాక గుడిలో, ఆశ్రమాలలో, మఠాలలో పదిమందిని కలిపి వారికి అన్నం పెట్టాలి. తన సంపాదనలో కొంతమేరకు దీనహీన పీడిత తాడిత జన

కసురుతూ మాట్లాడకు - విసుగుతో పనిచేయకు

సేవకై వినియోగించి వారిని సమున్నత స్థితిలోకి తీసుకొని రావాలి. సమాజానికి ముక్తిని సాధించని వ్యక్తికి ముక్తి వ్యర్థమని గుర్తించాలి.

## వీధి వీధికి సత్సంగాలు

ఊరూరా వీధి వీధికి క్లబ్బులు వెలసి మన సంస్కృతికి ప్రమాదకరంగా పరిణమించాయి. ఇది పాశ్చాత్య సంస్కృతి ; క్లబ్బు సంస్కృతి. మానవుని కోరికలన్నీ ఇక్కడే స్వేచ్ఛగా తీర్చుకోవచ్చు. ఇదీ వారి ఆలోచన మన సత్సంగాలు దీనికి భిన్నమైనవి. సత్సంగ కేంద్రాన్ని గుడిలోగాని, అనువైనచోట గాని ఏర్పాటు చేసుకోవాలి. ప్రసంగాలు, సంకీర్తనలు, ఇష్టాగోష్ఠులు, భక్తి ప్రదర్శనలు ఇలా ఎన్నో నిర్వహించాలి. ఆదిశంకరులు చెప్పిన సత్సంగం జీవన్ముక్తి వైపుగా తీసుకొని వెళ్లేది అన్న భావనతో శ్రద్ధతో నిర్వాహకులు జరిపించాలి. బుద్ధిజీవినీ ఆధ్యాత్మిక మానవుణ్ణి ఈ సత్సంగం ద్వారానే నిర్మాణం చేసే అవకాశం ఉంది. దీని వల్ల హిందుత్వం జాగరితమవుతుంది.

## బాలబాలికల ఆశ్రమాలు

తుఫానుల్లో వరదల్లో తల్లిదండ్రులను కోల్పోయి నిరాశ్రితులైన వారెందరో కనిపిస్తారు. ఆశ్రమాలు నెలకొల్పి వారిని చేరదీయాలి. ఆలయానికి అనుబంధంగానే ఆశ్రమాన్ని ఏర్పాటు చేయవచ్చు. వారికి చిన్నప్పటి నుండి సంస్కారాలందించాలి. పూజ, భజన, ప్రవర్తన, శ్లోక పద్యపఠన, సామూహిక పారాయణం తదితర అనేక అంశాల్లో శిక్షణ నివ్వాలి. ఇలా ఉత్తమ హిందువుగా తీర్చిదిద్దాలి. వాళ్ళకు రెక్కలొచ్చేంత వరకు ఆశ్రమజీవనంలోనే ఉంచాలి. వివాహానంతరం వారు హిందుత్వ వికాసం కొరకు ప్రయత్నంచేసే కార్యకర్తలుగా వ్యవహరించే వాతావరణం నిర్మించాలి.

## వృద్ధాశ్రమాలు

హిందూ సమాజానికి సేవ చేయాలనుకొన్న వారు స్వయంగా గాని, లేదా ఏ సంస్థ మాధ్యంగా గాని, లేదా ఏ ఆలయానికైనా అనుబంధంగా గాని వృద్ధాశ్రమాలు నెలకొల్పాలి. ఈ ఆశ్రమాల్లోకి సంతానంలేని వారినీ, సంతానం ఉన్నా వీరిని సరిగా చూచుకోకపోవడం వల్ల నిరాదరణకు గురియైన వారినీ, సరిగా చూచుకోడానికి ఆర్థిక స్తోమతలేని కుటుంబాలలోని వారిని, ప్రకృతి బీభత్సాల వల్ల దిక్కుతోచని వారిని, తమ సంతానం పరదేశాలకు వెళ్లడంవల్ల

**ఆశయం స్పష్టంగా ఉంటే విజయం తప్పక వరిస్తుంది**

ఒంటరిగా ఉండి బిక్కు బిక్కుమంటున్న వారిని ఆహ్వానించాలి. ఆశ్రమాల వారు వీరి అనుభవాలనూ, వారివారి వృత్తి నైపుణ్యాలను ఉపయోగించాలి. వృత్తి, విద్యలు, వ్యాపార, ఉత్పత్తి, పారిశ్రామిక, సేవా, ధార్మిక, సాంస్కృతిక, సంస్థల వారెవరైనా వీరి సలహాలను కోరినట్లయితే అందించే వ్యవస్థ ఏర్పాటు చేయాలి. ఈ వృద్ధులు జ్ఞానవృద్ధులు కూడా ; అందువల్ల వారిని ధార్మిక పారమార్థిక సంస్కృతీ విషయాలలో ప్రచారకులుగానూ, విస్తారకులుగానూ ఉపయోగించుకోవాలి. సాధ్యమైతే వారంతటవారే వెళ్లేందుకు సిద్ధపడేట్లుగా యోజన చేయాలి. అనుభవజ్ఞులైన ఈ వృద్ధుల మాటలు "పెద్దల సుద్దులు పెరుగన్నం ముద్దలుగా" ఉంటాయనేది గ్రహించి సద్గుణ సంపదతో నిండి అలరారే సమాజ నిర్మాణం నిమిత్తం వీరిని ప్రేరేపించే విధంగా నిర్వాహకులు వ్యవహరించాలి. ఇది అతి సనాతన కాలంలో మన ఆర్ష గ్రంథాలు చెప్పిన ఆశ్రమ ధర్మంలోని వానప్రస్థ, సన్యాసాది ఆశ్రమ వ్యవస్థలో అంతర్భాగమే అని గుర్తించి, ఆ అఖండ సంస్కార ధారకు ఇది ఆధునిక రూపమనేది కూడా అందరికి తెలిసేట్టు చేయాలి. ఎందుకంటే సంప్రదాయంలోని నవ్యత్వాన్ని వెంటనే స్వీకరించడానికి ఆధునిక సంఘం సంసిద్ధంగా ఉంటుందనేది అందరూ చెబుతున్న విషయమే. ఇలా వృద్ధాశ్రమాలు హిందూ జాగరణకు దోహదం చేసే విధంగా తీర్చిదిద్దుకోవాలి.

**- ఆచార్య కసిరెడ్డి, 98669 56250**

# సత్సాంగత్యం

**ఎప్పుడు సత్సాంగత్యమే చెయ్యి. చెడు స్నేహాలు విడిచి పెట్టు. నువ్వు జాగ్రత్త పడకపోతే వారు నీ శీలాన్ని పాడు చెయ్యగలరు. జూదం, పేకాట, ధూమపానం వంటి అలవాట్ల జోలికి పోకు. ఎల్లప్పుడు భక్తులతో, జ్ఞానులతో సాంగత్యం కోరుకో. నిశ్శబ్దంగా కూచుని, వారి బోధలను విని, ఆచరించు.**

మనస్సు నిర్మలంగా (నిర్ మలినంగా) వుండటమే శాంతి

హిందూధర్మ భారతి

# హిందూ ధర్మ సమగ్ర స్వరూపం
## (ALL ABOUT HINDUISM)

ఐదో అధ్యాయం

*(గత సంచిక తరువాయి)*

## హిందూ సిద్ధాంతాలు

- శ్రీ స్వామి శివానంద

## కర్మశాస్త్రం

కర్మ అంటే ఏమిటి? కర్మ అంటే మనంచేసే పనిమాత్రమే కాదు, ఆ కర్మ చేయడం వల్ల కలిగే ఫలంకూడా. కర్మవల్ల కలిగే పరిణామం వేరుకాదు, కర్మలోని అంశమే. కర్మనుంచి దాన్ని వేరుచేయడానికి వీలులేదు. శ్వాస తీసుకోవడం, ఆలోచించడం, మాట్లాడటం, చూడటం, వినడం, తినడం మొదలైనవి కర్మలే. ఆలోచించడం మానసికకర్మ అయితే మిగతావి శారీరకకర్మలు. ఈ జన్మలోనూ గత జన్మలలోనూ మనం చేసిన పనుల మొత్తమే కర్మ.

పరిణామం కలిగించే ఏ పని అయినా, ఏ ఆలోచన అయినా కర్మే. కర్మ సిద్ధాంతం అంటే కారణసిద్ధాంతం. ఎక్కడ కారణం వుంటుందో అక్కడ పరిణామం వుండి తీరాలి. విత్తనం కారణం, వృక్షం ఫలం. ఆ చెట్టు మళ్ళీ విత్తనాలను తయారు చేసి వాటికి కారణభూతమవుతుంది.

## కర్మ ఎలా రూపు దిద్దుకుంటుంది?

మనిషిస్వభావం మూడింటి సమ్మేళనం. ఇచ్ఛ (కోరిక, భావన), జ్ఞానం, క్రియ. ఈ మూడింటి సమ్మేళనంవల్ల అతని కర్మ రూపు దిద్దుకుంటుంది. అతడు సుఖ, దుఃఖాలను అనుభవిస్తాడు. కుర్చీ, చెట్టు మొదలైన స్థూలవస్తువుల్ని గుర్తిస్తాడు. ఇది చేయాలి ఇది చేయవద్దు అనే సంకల్పం చేస్తాడు. ప్రతి క్రియ వెనుక ఒక కోరిక, భావన వుంటాయి. ఒక వస్తువుపట్ల కోరిక మనస్సులో కలుగుతుంది. దాన్ని ఎలా పొందాలి అని ఆలోచిస్తాడు.

సంతోషంతో ప్రతిపని చేసేవారికి కష్టసాధ్యం ఏమీలేదు

ఆ తర్వాత దాన్ని పొందటానికి శ్రమిస్తాడు. కోరిక, ఆలోచన, క్రియ కలిసే వుంటాయి. ఈ మూడు పోగులను కలిపి పేనితే తయారయ్యే దారమే కర్మ. కోరిన వస్తువును పొందడానికి చేసే క్రియల వల్ల బాధ, సంతోషం అనే ఫలితాలు కలుగుతాయి. ఈ కర్మఫలితాలను అనుభవించడానికి ఒక జన్మ తర్వాత మరోజన్మ నెత్తాలి. ఇదే కర్మసిద్ధాంతం.

## కర్మ సిద్ధాంతం పని చేసే విధం

కర్మసిద్ధాంతం హిందూధర్మంలోనే కాకుండా బౌద్ధ, జైనమతాల్లోని మూల సిద్ధాంతాలలో ఒకటి, మనిషి ఏ విత్తనం నాటుతాడో ఆ ఫలమే పొందుతాడు. ఇదే కర్మసిద్ధాంతం. మంచిపనిచేస్తే సంతోషం, చెడుపని చేస్తే దుఃఖం తప్పకుండా కలుగుతాయి. కర్మకు తగ్గ ఫలితం పొందడాన్ని ప్రపంచంలోని ఏ శక్తి ఆపలేదు. ప్రతి ఆలోచన, ప్రతి వాక్కు, ప్రతి క్రియ శాశ్వతమైన దివ్యమైన ధర్మాసనంలో వున్న త్రాసులో తూకం జరుగుతుంది. కర్మ సిద్ధాంతం అతికఠినమైనది.

ఈ విశ్వంలో ఏ సంఘటన కూడా ప్రమాదవశాత్తు కాని, యాదృచ్ఛికంగా కాని అస్తవ్యస్తంగా జరుగదు. అంతా క్రమబద్ధంగా జరుగుతుంది. క్రమపద్ధతిలో ఒక దాన్ని అనుసరిస్తూ మరోటి వస్తాయి. నీవు ప్రస్తుతం ఏం చేస్తున్నావో, భవిష్యత్తులో ఏమి జరుగుతుందో వాటి మధ్య ఖచ్చితమైన సంబంధం వుంది.

ప్రతి క్రియ మూడురకాల పరిణామాలను కలుగజేస్తుంది. క్రియకు తగిన బహుమానం, ప్రతిఫలం లభిస్తుంది. నీ స్వభావంపై ప్రభావం చూపుతుంది. నీ మనస్సులో చెరగని ముద్ర వేస్తుంది. ఈ చెరగని ముద్ర ఆ క్రియను మళ్ళీ చేయుమని మనస్సును ప్రేరేపిస్తుంది. ఈ ముద్ర బాహ్య లేక అంతరంగ ప్రేరణవల్ల ఆలోచనా తరంగంగా మారుతుంది. అన్ని క్రియలు ఈ ప్రపంచంలో కూడా పరిణామాలను, ఈ ప్రపంచంలో కూడా అన్ని క్రియలు పరిణామాలును కలుగచేస్తాయి.

## ఏది నాటితే ఆ ఫలమే పండుతుంది

నీవు ఒక విత్తనాన్ని భూమిలో నాటితే, మొక్కకు క్రమంగా ఆకులు, పూలు, ఫలాలు కలుగుతాయి. ఆ ఫలాలలో తిరిగి విత్తనాలు ఏర్పడతాయి. మామిడి విత్తనం, మామిడి మొలకలు మాత్రమే ఇస్తుంది. నీవు వరి గింజలు నాటితే గోధుమ పంటను ఆశించరాదు. మానవ గర్భంలో మానవుడు, గుఱ్ఱం గర్భంలో గుఱ్ఱం, కుక్క గర్భంలో కుక్క జన్మిస్తాయి. అదే విధంగా నీవు చెడుపని చేస్తే నీకు బాధ, దుఃఖం అనే ఫలాలు కలుగుతాయి. నీవు సత్కర్మను చేస్తే సుఖసంతోషాలు కలుగుతాయి. ఇదే కర్మ సిద్ధాంతం.

**నూరు మాటలు చెప్పటం కంటే ఒకటి చేసి చూడటం మేలు**

నీ కర్మలద్వారా ఏది నాటితే, అదే నీకు తిరిగి లభిస్తుంది. నీవు ఇతరులను సేవ, దాతృత్వం, ప్రియమైన కర్మలతో సంతోషపెడితే, నీవు సంతోషం అనే విత్తనం నాటుతావు. దాంతో నీకు సంతోషం అనే ఫలం లభిస్తుంది. ఇతరులను పరుషవాక్యాలు, అవమానం, దుష్ప్రవర్తన, క్రూరచర్యలు లాంటి కర్మలతో బాధిస్తే, నీవు దుఃఖం అనే విత్తనం నాటి బాధ, దుఃఖం, కీడు, మానిసికబాధ అనే ఫలాలుగా పొందుతావు. ఇదే ఎలాంటి మార్పులేని, స్థిరమైన కర్మసిద్ధాంతం.

గతంలో నీవు చేసిన కర్మలే నీ వర్తమానపరిస్థితికి కారణం. వర్తమానంలో నీవు చేస్తున్న కర్మలు నీ భవిష్యత్తుకు రూపకల్పన చేస్తాయి. ఈ ప్రపంచంలో చంచలం, అనిశ్చితం అంటూ ఏది లేదు. నీవు మంచిపనుల ద్వారా మంచి, చెడుపనుల ద్వారా చెడు అవుతావు.

నీకు దురాలోచనలు కలిగితే, దాని ఫలితం అనుభవించక తప్పదు. నీవు కష్టాల్లో కూరుకపోతావు. నీ చుట్టూ ప్రతికూల పరిస్థితులు ఏర్పడతాయి. నీకు కలిగే కష్టనష్టాలకు నీ పరిసరాలను, పరిస్థితులను నిందిస్తావు. కర్మసిద్ధాంతాన్ని అర్థం చేసుకొని తెలివిగా జీవించు, సదాలోచనలతో నీవు సదా సంతోషంగా ఉండగలుగుతావు.

## క్రియ - అలవాటు - స్వభావం - గమ్యం

ఆలోచనలే నీ స్వభావాన్ని తీర్చిదిద్దుతాయి. నీలో సద్గుణాలు వుంటే నీ స్వభావం ఉదాత్తంగా వుంటుంది. చెడుఆలోచనలు వుంటే నీచస్వభావం ఏర్పడుతుంది. ఇదే అచంచలమైన ప్రకృతి సిద్ధాంతం. అందుకే, నీవు సదాలోచనలతో నీ స్వభావాన్ని తీర్చిదిద్దుకోవాలి. ఆలోచనలు క్రియారూపం దాల్చి కర్మలుగా మారుతాయి. మంచి గురించి ఆలోచిస్తూ, ఉన్నతమైన ఆలోచనలతో నీవు సుఖంగా జీవిస్తూ గొప్పకర్మలు చేస్తావు.

నీ ప్రవర్తన నీ స్వభావాన్ని తెలియజేస్తుంది. దానికి రూపకల్పన చేస్తుంది. సత్ప్రవర్తన అలవర్చుకోవాలంటే కఠినమైన క్రమశిక్షణ, నిరంతర జాగరూకత అవసరం. నీవు ప్రతి ఆలోచనను, మాటను, చర్యను నిశితంగా గమనించాలి. ఇతరులతో నీవు ప్రవర్తించే విధానం పట్ల అత్యంత జాగరూకతతో వుండాలి. నీకు ఎన్ని సదుద్దేశాలున్నా, నీ గతజన్మల వాసనలు, ప్రేరణలవల్ల నీవు గతి తప్పవచ్చు. కొన్ని పర్యాయాలు ఉన్నత విద్యావంతుల ప్రవర్తనలో కూడా లోటు అగుపడ్తుంది. సత్ప్రవర్తన నీలోని క్రమశిక్షణకు, వాస్తవమైన, మంచి ఆధ్యాత్మిక సంస్కృతికి అద్దం పడుతుంది. జపం, ప్రాణాయామం, మౌనం వల్ల నీలోని ప్రేరణలను నియంత్రించవచ్చును.

**కోట్లకు అధిపతులైనను - ఒక్క నిముషం ఆయుష్షును కొనలేరు**

నీ కర్మ అలవాటుగా మారుతుంది. అలవాటు శీలంగా మారుతుంది, శీలం నీ గమ్యాన్ని సూచిస్తుంది. అందుకే నీ గమ్యాన్ని నిర్ణయించడం నీ చేతుల్లో వుంది. సదాలోచనలతో, సత్కర్మలతో, నీ ఆలోచనాసరళిలో తగిన మార్పులు చేసి నీ గమ్యాన్ని నీవే నిర్ణయించుకోవాలి. ఈ శరీరమే "నేను" అని ఆలోచిస్తున్నావు. దీనికి వ్యతిరేకంగా సర్వాంతర్యామి, అనంతం అయిన బ్రహ్మమని భావించడం ప్రారంభించు. నీవు బ్రహ్మంగా మారడం తథ్యం. ఇదే నిశ్చలమైన సిద్ధాంతం.

## మూడు రకాల కర్మలు

కర్మలు మూడురకాలు. సంచిత, ప్రారబ్ధ, క్రియామాన లేదా ఆగామికర్మలు. గతకర్మల ప్రోగు సంచితం. దానిలో కొంతభాగం మానవుడి స్వభావం, అభిప్రాయాలు, ఇష్టాలు, సామర్థ్యాలు, ఇచ్ఛ, కోరికలుగా వ్యక్తమవుతుంది. వర్తమానకాలంలో వుండే భౌతికశరీరానికి కారణమైన పూర్వకర్మలలోని కొంతభాగమే ప్రారబ్ధం. సంచిత కర్మలలోని ఏ భాగం ప్రస్తుత జన్మలోని జీవనాన్ని ప్రభావితం చేస్తుందో అదే ప్రారబ్ధం. దీన్ని మార్చడానికి, తప్పించుకోవడానికి వీలులేదు. దీన్ని అనుభవించి వ్యయం చేసుకోవాల్సిందే. పాతఋణాలు తీర్చుకోవాల్సిందే. ఏది ఆరంభమై ఫలితాలను ఇస్తుందో అదే ప్రారబ్ధ కర్మ. క్రియామాన కర్మ అంటే నీ భవిష్యత్తును నిర్మించే నీవు చేసే కర్మ. దీనినే ఆగామి లేదా వర్తమానం అంటారు. వైదికవాఙ్మయంలో ఒక అందమైన ఉదాహరణ వుంది. ఒక విలుకాడు తన ధనుస్సును సంధించి బాణాన్ని వదిలాడు. అది అతని ధనుస్సును వదిలివెళ్ళిన తర్వాత దాన్ని వెనక్కి రప్పించలేడు. తర్వాత మరో బాణాన్ని వదలడానికి సిద్ధం అయ్యాడు. అతని తూణీరంలో వున్న బాణాలన్నీ సంచితం అయితే, అతడు వదిలిన బాణం ప్రారబ్ధం, వదలబోతున్న బాణం ఆగామి. ఈ మూడింటిలో సంచిత, ఆగామిలపై అతనికి సంపూర్ణ నియంత్రణ వుంటుంది. ఒక ప్రారబ్ధం విషయంలోనే జాగ్రత్తగా వ్యవహరించాలి. ఫలాన్ని అందించే గతాన్ని అనుభవించక తప్పదు.

బ్రహ్మజ్ఞానం పొందడం వల్ల సంచితకర్మలన్నిటినీ నాశనం చేయవచ్చును. ఉన్నతమైన, దివ్యమైన ఆలోచనల్తో సత్కార్యాలతో దానిలో ఎంతో మార్పు తీసుకు రావచ్చును. ప్రాయశ్చిత్తం ద్వారా, నిమిత్త, సాక్షీ భావాలను పెంపొందించుకొని ఆగామి కర్మలను నశింపచేయవచ్చును.

## స్వేచ్ఛా సంకల్పపు ఆధిపత్యం

నీ విధికి నీవే అధికారివి. నీ అదృష్టాన్ని మలిచే శిల్పివి నీవే. నీ ప్రస్తుత పరిస్థితులకు, బాధలకు బాధ్యుడవు నీవే. నీవు సంతోషంగావున్నా, దుఃఖంగావున్నా అది నీవు చేసుకున్నదే.

**ఆదాయానికి మించిన ఖర్చు అప్పు చేయిస్తుంది**

ప్రతి కర్మ ఎప్పుడో ఒకప్పుడు ఫలితాన్నిస్తుంది. ధర్మకార్యం సత్ఫలితం ఇస్తే అధర్మకార్యం దుష్ఫలితం ఇస్తుంది.

నీకు భోగస్వాతంత్ర్యం లేదు. కాని కార్యస్వాతంత్ర్యం ఉంది. ఆ కారణంగానే శ్రీకృష్ణుడు భగవద్గీతలో "కర్మణ్యేవాధికారస్తే, మా ఫలేషు కదాచన" – కర్మ చేయడం నీ విధి, ఫలితం కాదు అని అంటాడు. జనకుడు లాంటి కర్మయోగులు తమ కర్మల వల్ల సంపూర్ణత్వాన్ని సాధించారు. నీవు నీ స్వభావాన్ని, ఆలోచనలను, కోరికలను మార్చగలవు. మానవుడి సంకల్పానికి సంపూర్ణ స్వేచ్ఛ వున్నది. స్వార్థం వల్ల అది మలినమయ్యింది. అతడు తన సంకల్పాన్ని శుద్ధంగా, దృఢంగా, శక్తివంతంగా చేయగలడు. ప్రతి ఆత్మ కూడా కొంత భూమి వున్న రైతు లాంటిది. దాని విస్తీర్ణం, భూమి స్వభావం, వాతావరణ పరిస్థితులు ఇది వరకు వున్నవే. ఆ భూమిని దున్ని, ఎరువు వేసి పంటలు పండించడం లేదా దాన్ని బీడు భూమిగా వుంచడమనే సంపూర్ణ స్వేచ్ఛ అతడికి వుంది.

పూర్వజన్మలలో నీవు చేసిన ఆలోచనలు, నీవు ఆచరించిన కర్మల ఫలితమే నీ ప్రస్తుతపరిస్థితి. భవిష్యత్తులో ఏముంటుందో ప్రస్తుతం నీవు చేసే ఆలోచనలపై, కర్మలపై ఆధారపడి వుంటుంది. గత జన్మలో నీవు పెంచుకున్న స్వభావాలకనుగుణంగా ప్రస్తుత వాతావరణం ఏర్పడింది. నీవు నీ కర్మలను ఎన్నుకొని భవిష్యత్తులో మంచి వాతావరణం సృష్టించుకోగలవు. సంపూర్ణత్వంలో ఉన్నత స్థాయికి ఎదుగగలవు. ఒక ఇంద్రుడిగా, ఒక గొప్పయోగిగా మారగలవు. అందుకే భీష్ముడు, వశిష్ఠుడు లాంటి మహనీయులు విధికన్నా పురుషార్థానికే ఉన్నత స్థాయినిచ్చారు.

తెడ్లు, తెరచాప, చుక్కాని లేని నావికుడు అసహాయుడై గాలికి, నీటి ప్రవాహానికి కొట్టుకపోతాడు. అదే తెరచాప, తెడ్డు, చుక్కాని వున్న సరంగు తన పడవను తన ఇష్టంవచ్చిన దిశలో నడుపుతూ సురక్షితంగా అవతలి ఒడ్డుకు చేరుతాడు. అదే విధంగా ఆలోచనా సిద్ధాంతం, కర్మ సిద్ధాంతం, కార్యకారణ సిద్ధాంతం అనే ప్రకృతి నియమాలను అర్థంచేసుకున్న మనిషి ఈ సంసారసాగరంలో నిర్భయంగా పయనించి, ధైర్యం, శాశ్వతత్వం అనే తీరాన్ని సురక్షితంగా చేరుతాడు. తనకు సహకరించే శక్తులను పూర్తిగా వినియోగించుకొని ప్రకృతినియమాలజ్ఞానం ద్వారా వ్యతిరేక శక్తులను నివారించగలడు. జ్ఞానం ఒక దీపం, జ్ఞానం అత్యావశ్యకం. అజ్ఞానం గొప్ప పాపం. అజ్ఞాని, స్వభావానికి బానిసగా మారిపోతాడు.

*(సశేషం)*

**నిర్భయతకు ఆధారం - సత్యత**

# భావ పరిణతి

## వ్యష్టి దృష్టి

మూలం : స్వామి దయానంద సరస్వతి　　　　సేకరణ : స్వామి సర్వవిదానంద

*(గత సంచిక తరువాయి)*

## ప్రతిక్రియ ఒక ఘటనే

నీవు దిగులుగా ఉండాలని కోరుకోవు. కానీ దిగులు పడతావు. ఇక్కడొక విషయమర్థం చేసుకోవాలి. ఆలోచించకుండా ఎవరూ దిగులు పడరు. ఏ ఒక్క ఆలోచనా నిన్ను దిగులుపడేట్లు చేయదు. విద్యుత్తు ఆగిపోయిందనుకుందాం. అది నిన్ను విసుగు చెందేట్లు, చిరాకు పడేట్లు,కోపం తెచ్చుకునేట్లు చేయవచ్చు. లేదా వాస్తవాన్నంగీకరించి ప్రశాంతంగా కూర్చోని ధ్యానం చేసుకు నేట్లు చేయవచ్చు. ఏదో ఒకటి చేయాలి. చేయగలిగింది చేస్తాం. దాన్నే స్వీకరించటమని నేనంటాను.

ఒక పరిస్థితిని స్వీకరించడమంటే ఏమీ చేయకుండా ఊరకే చూస్తూ కూర్చోవటం కాదు. పరిస్థితుల ప్రభావంలో పడి కొట్టుకుపోకుండా చేయవలసినది చేయటమే స్వీకరించట మంటే. ఒక సంఘటన దానికదిగా విచారాన్ని కలిగించదు. వాస్తవాన్నంగీకరించటానికి నేను తిరస్కరించినపుడు, రాగల పరిణామాలను చిలవల పలవలగా ఊహించటమారంభిం చినపుడు అది విచారానికి దారితీస్తుంది. ఒక సంఘటన ఒక రకమైన ఆలోచనను రేకెత్తించి దానినే కొనసాగేటట్లు చేస్తుంది. ఫలితంగా విచారపడడం జరుగుతుంది. అదెందుచేతనంటే నీవంతకు ముందే విచారానికి లోనై ఉన్నావు. ప్రతివారిలోనూ అనేకానేక రాగద్వేషములు నెరవేరకుండా మిగిలిపోయి ఉన్నాయి. అందుచేత ప్రతి ఒక్కరు ఏదో విధంగా విచారగ్రస్తులయే ఉన్నారు. వాటికతీతంగా ఎదిగామనుకుంటాం. కానీ మనం ఉన్న పరిస్థితి, మాత్రం అదికాదు. మనం చేపట్టిన కార్యాలను వదిలివేస్తుంటాము. ఎందుకంటే అవి సాధించలేమని మనకు తెలుసు. కనుక అవి మన వ్యక్తిత్వపు ఆధార కేంద్రములుగా మిగిలిపోతాయి. విచారాలు మొదలైన వాటికి దారితీస్తాయి. సాధారణంగా ఎవరైనా విచారగ్రస్తులవటానికి పెద్ద సంఘటన

అపకారికి ఉపకారం చేయుటమే ఉత్తమ లక్షణం

జరగాల్సిన అవసరమేమీ లేదు. ఒక రకమైన ఆలోచనా విధానం చోటుచేసుకుంటే చాలు. దానిపై ఎంత మాత్రం అదుపువుండదు. ఆ విధంగా దిగులు–విచారము యాంత్రికమైనది.

అదే విధంగా భయము, ఆందోళన, ఈర్ష్య, ఇవన్నీ కలుగుతుంటాయి. నీ కిష్టం లేనిది నీకేర్పడుతుంది. కానీ నీకిష్టమైన దానిని బుద్ధిపూర్వకంగా నీవు కలిగించుకోవాలి – సాధించాలి. సాధారణంగా మనం మన ఆలోచనల్లో యాంత్రికంగా ఉంటాం కనుక ఈ పత్రిక్రియలు మనలో కలుగుతూనే ఉంటాయి. ఈ స్థితిలో మనమనుభవించే ఆనందపు క్షణాలు కూడా మనకప్రయత్నంగా కలుగుతుంటాయననిపిస్తుంటుంది. ఎందుకంటే అవి చాలా అరుదుగా లభిస్తాయి. వ్యవధానం ఎక్కువగా ఉంటుంది గనుక కానీ నిజానికి ఆనందం యాంత్రికమైనది కాదు. చేతనాయుక్తంగా సాగే క్రమమది.

ఆయా సందర్భాలలో నీవు బుద్ధి పూర్వకంగా పాల్గొంటే నీవానందంగా ఉంటావు – ఉదాహరణకు సంగీతం వింటున్నప్పుడు ఆ సందర్భం నీ ఎఱుకలో ఉన్నది. ఆ పరిస్థితీ నీవూ ఒకటవుతారు. ఆనందంగా వున్న వ్యక్తికీ అనుభవానికి మధ్య ఏ రకమైన ఆటంకం – విభాగం లేదు. రెండూ–ఒకటవుతాయి. యాంత్రికమైన ఆలోచనల్లో, అలాగాక, నీకే విధమైన అదుపు, స్వాంతంత్ర్యం ఉండదు. కానీ నేటి పరిస్థితెలా ఉందంటే ఆనందపు క్షణాలు కూడ అప్రయత్నంగా ఏర్పడేవిగా ఉన్నాయి. అదృష్ట హస్తాలు వాటిని మలచి మనకందించ వలసినట్లుగా ఉన్నది. ఆ ఆనంద ఘడియలు కూడ మన చేతుల్లో లేనట్లుగా అనిపిస్తుంది. అంటే మనకే మాత్రం స్వేచ్ఛలేని, భయాందోళనలు దిగులు లాంటి ప్రతిక్రియలాగా అనిపిస్తోంది ఆనందం కూడ. కానీ అది సరికాదు. ఎందుకంటే ఆనందంగా ఉన్నప్పుడు తన గురించిన, తన అనుభవం గురించిన ఎరుక ప్రతి వారికి ఉంటుంది. క్రియకు ప్రతిక్రియకు ఉన్న భేదాన్ని నిశితంగా, సూక్ష్మంగా పరిశీలించి అవగతం చేసుకోవాలి. ఒక స్పందన ప్రతిక్రియా కాదా అన్నది చాలా సన్నిహితంగా పరిశీలించి అవగతం చేసుకోవాలి. దుఃఖమొక ప్రతిక్రియ. క్రోధం, ఈర్ష్య, నిరాశ, ద్వేషం, క్రుంగి పోవటం – ఇవన్నీ ప్రతిక్రియలు. తనతో పాటుండటానికిష్టపడకపోవటం కూడా ప్రతిక్రియే. ఒక విషయంలో అతిగా గొఱుక్కోవటం, సర్దుకుపోలేక పోవటం, దుఃఖాంశం మిశ్రితమై ఉండటం, క్రోధం వీటన్నిటిలో ప్రతిక్రియ అంతర్గతమై ఉన్నది. క్రియకు ప్రతిక్రియకు ఉన్న భేదాన్ని గమనించగలిగితే నీవు పరిస్థితిని చక్కబెట్టగలవు.

**అందరి మేలు కోరుకోవటమే మనకు మేలు**

## సహాయం అర్థించు

ఏం జరుగుతున్నదో స్పష్టంగా తెలియకపోతే నీవు దేన్నీ సరిగా నిర్వహించలేవు. ఆంతరంగిక పరిశీలన, దాని గురించిన సరియైన జ్ఞానం లేకపోవటం వలన లోపల నుండి వచ్చే ప్రతిస్పందనలను క్రమబద్ధం చేయక, అలాగే జరగనిస్తావు. ప్రతి సంఘటనను సరియైన రీతిలో నిర్వహించగల సామర్థ్యం మనకుండాలని కోరుకుంటాము. అప్పుడే రాగద్వేషముల ప్రభావానికి, క్రోధము, లోభం, అసూయ మొదలగు వాటికి లోనుకాకుండా ఉండగలం. కోపంవస్తే దాన్ని చూడగలగాలి. దాని తీరుతెన్నులు, మూలాన్ని తెలుసుకోగలగాలి. ఆ సామర్థ్యం కోసమే మనమిప్పుడు ప్రయత్నిస్తున్నాం.

ప్రస్తుతం ప్రతిక్రియల విషయంలో నేను నిస్సహాయుడను. కోపాన్నదుపు చేయగల శక్తి నాకేమాత్రం లేదనిపిస్తున్నది. అర్థం చేసుకోండి – నిస్సహాయతను నొప్పుకోవటానికెంతో ధైర్యం కావాలి. నిస్సహాయత నొప్పుకునే ధైర్యం లేకపోతే దానికతీతంగా ఎన్నటికీ ఎదగలేను. సహాయం లభిస్తున్నా దానికోసం చూడను. ఒక తాగుబోతు విషయం లాంటిదిది. "ప్రతిరోజు ఎందుకు తాగుతావని" ఎవరైనా తాగుబోతుని ప్రశ్నిస్తే, "నేను తాగుబోతును కాను. ఏరోజైనా తాగటం మానేయగలన"ని సమాధానమిస్తాడు. ఈ సమాధానం ఆ వ్యక్తి నుండి కంటె ఆ మద్యపానీయం ఉండే ఎక్కువగా వస్తుంది. మద్యపానం మానివేయాలనే వ్యక్తి మొట్టమొదట మద్యపాన విషయంలో తనకేమాత్రం అదుపులేదని అంగీకరించాలి. అదే విధంగా, నా కోపం మీద, విచారం, నిరాశ, దుఃఖం మొదలైన వాటి మీద నాకేమాత్రం అధికారం లేదని చాలా స్పష్టంగా తెలుసుకోవాలి.

కొంతమంది సలహా ఇస్తుంటారు. "దిగులు పడకు" అని. తరచుగా మత బోధకులు సలహాదారులవుతుంటారు. జరుగుతున్న దేమిటో ఎవరికీ అర్థమయినట్లనిపించదు. కావాలని ఎవరూ క్రుంగిపోరు, దిగులు పడరు. అలా జరుగుతుందంతే. కనుక దిగులుపడకుండా ఉండే స్వేచ్ఛ అతడికుండదు. కాబట్టి దిగులుపడవద్దని సలహానివ్వటంలో అర్థం లేదు. కోపం తెచ్చుకోవద్దనెవరికైనా సలహి ఇస్తే వారికింకా కోపమొస్తుంది. కావాలనెవరూ కోపం తెచ్చుకోరు. కోపం వస్తుందంతే. కాబట్టి దాన్నర్థం చేసుకోండి. కోపం మీద, విచారం మీద, దుఃఖం మీద, యాంత్రికమైన ఆలోచలను మొదలగు వాటి మీద నీకే మాత్రమధికారం

సత్యమనే సూర్యుడిని అసత్యమనే మేఘాలు కప్పజాలవు

లేదు. అదుపు లేదు. ఎందుకని ? అవి యాంత్రికం కాబట్టి వాటిమీద నీ కధికారమున్నట్లయితే అసలు ముందుగానే వాటి నుంచుకోవు – అసలు దరికి రానీయవు. ఇది సరిగా అర్థమయితే నీకై మార్గం తెరుచుకుంటుంది.

ప్రతిదీ మనకివ్వబడిందని నేనన్నప్పుడు, సహజంగానే ప్రశ్న తలెత్తుతుంది. "ఇచ్చే వాడున్నాడా ? ఉంటే అతడి స్వరూప స్వభావాలే?" అని. నా ప్రతి క్రియల నదుపుచేయలేని నిస్సహాయుడినైనపుడు సహాయానికై నేనా "ఇచ్చే వాని" దరిజేరవచ్చు. ఎందుకంటే ప్రతి వారూ నేనున్న స్థితిలాంటి స్థితిలోనే ఉన్నారు. నేను విచారంలో ఉన్నాను. మరో వ్యక్తి కూడ విచారంలోనే ఉన్నాడు. ఇద్దరు విచారగ్రస్తులు ఒక దగ్గర చేరితే అదేమీ ఆనంద డోలిక నేర్పరచదు. నీట మునుగుతున్న వ్యక్తి మరో మునిగిపోతున్న వ్యక్తిని పట్టుకుంటే ఆ పెనుగులాటలో ఇద్దరూ మునిగిపోతారు. కాబట్టి నేనా "ఇచ్చే వానిని" చేరి సహాయమర్థించాలి– "పరమేశ్వరా! నేను నిస్సహాయుడను. నేను మార్చలేని దానిని సంతోషంగా అంగీకరించే పరిపక్వతను ప్రసాదించు! అవకాశమున్న దానిని మార్చే సంకల్పము ప్రయత్న శీలత్వము అనుగ్రహించు. ఆ రెండింటి భేదాన్ని గుర్తించగలిగిన వివేకాన్ని ప్రసాదించు!"

మనకున్న సమస్యలన్నింటికీ వాస్తవాలనంగీకరించటాని కొప్పుకోక పోవటమే కారణం. తరచుగా మనం మార్చలేని విషయాలకే మధనపడుతుంటాము. మార్చగలిగినవి, మార్చలేనవి మనకి తెలియదు. అవి మనకి తెలిస్తే మన ప్రయత్నాలలో కొన్నింటిని వినియోగించి మనశక్తి సామర్థ్యాలను మళ్ళిస్తాము. మన ప్రయత్నాలకొక దిశ లభిస్తుంది. *(సశేషం)*

**చెడును సహించి ఊరుకుంటే అది మొత్తం వ్యవస్థనే విషపూరితం చేస్తుంది**

✶✶✶

**డబ్బుతో ఏమైనా చెయ్యగలమనుకునే వారు, డబ్బు కోసం ఏమైనా చేస్తారు**

✶✶✶

**మూసిన తలుపులు తెరవటం సులభం, మూసిన మనసును తెరవటం చాలా కష్టం**

**లక్ష్యసాధనకు ప్రయత్నం ఆప కూడదు, వెను తిరగ కూడదు**

సందేశ భారతి

# శ్రీ రమణతత్త్వము

*(గత సంచిక తరువాయి)* - **శ్రీమతి బొప్పన అరుణాదేవి**

మృతికి మళ్ళీ పుట్టుకకూ మధ్య వ్యవధి ఎంత ? అని భగవాన్‌ని ఒకరు ప్రశ్నించారు. మహర్షి వానితో 'ఎక్కువా ఉండవచ్చు తక్కువా ఉండవచ్చు. కాని జ్ఞానికి అలాంటి మార్పు లేమీ ఉండవు. అతడు విశ్వాత్మలో లీనమవుతాడని బృహదారణ్యక ఉపనిషత్తు చెపుతోంది. చనిపోయిన తర్వాత తేజోమార్గంలో పయనించేవారు మరి జన్మించరు. ధూమ్రమార్గంలో వెళ్ళేవారు సూక్ష్మతనువులతో, కర్మఫల భోగాలను అనుభవించిన తర్వాత పునః జన్మిస్తారని చెపుతారు.

జీవుని పుణ్యపాపములు సమపాళ్ళలో ఉంటే వాడు సూటిగా మళ్ళీ భూమిపై జన్మిస్తాడు. పుణ్యం పాలు ఎక్కువయితే, సూక్ష్మ శరీరంలో స్వర్గలోకానికి పోయి, ఆ తర్వాత భూమిపై పుట్టుక జరుగుతుంది. యోగభ్రష్టుని గతి కూడా అంతే.

అయితే ఇవన్నీ శాస్త్రాల్లో వివరించినవి. కాని నిజంగా పుట్టుచావులు లేవు. ఎవని నైజం ఎలాగో వాడు అలాగే ఉంటాడు. ఏకైక సత్యం ఇదే అన్నారు శ్రీ భగవాన్.

యోగశాస్త్రాల్లో పలురకాలయిన ఆసనములు, వాని ప్రయోజనములతో సహా చర్చించారు. పద్మాసనము, సుఖాసనము లాంటివి. ఇవన్నీ ఎందుకు ? జీవుడు తాను దేహమని భ్రాంతి చెంది, జగత్తు నిజమని పొరబడ్డాడు. విషయములు అనేకములుగా భావించాడు. అతడిని అహంకార రూప అజ్ఞానం కప్పింది. అన్నింటికి కేంద్రం తానేనని, ఆధారమే తానని తెలియక ఆసనానికై వెదుకుతాడు. అవి లేక తన జపధ్యానాది నిష్ఠల శక్తి కుంఠితమౌతుందని ఊహిస్తాడు. శక్తి ఎక్కడ నుండి వస్తుంది ? వాడే సారథి, అన్నింటికి ప్రాపు, కేంద్రం అతడే అంటున్నాడు మహర్షి.

భగవాన్ అంటున్నారు, తన దగ్గరికి వచ్చిన వారందరూ తమ్ముగూర్చి అడగటం మానివేసి, ఏవేవో అంతులేని ప్రశ్నలు అడుగుతారని, 'జీవన్ముక్తుడు జగత్తును పరికిస్తాడా ? కర్మ అతడిని బాధిస్తుందా ? తనువు పోయిన తర్వాత విమోచనము ఎట్టిది? ముక్తి తనువు దొరికిన తర్వాతనా, ఇంకా ప్రాణం తనువులో ఉన్నప్పుడేనా ? యోగి శరీరం తేజస్సులో

పరమాత్మను స్మరించు - నిశ్చింతంగా జీవించు

లీనమవుతుందా? దేహాన్ని శవరూపంగా వదలిన తర్వాత కూడా యతి ముక్తుడు కాగల్గునా? ఇలా ప్రశ్నలకు అంతుండదు. అన్ని విధాలుగా వారు తమని ఎందుకు బాధ పెట్టుకుంటారు. విషయం వదిలేయి. ఇప్పుడు బంధమున్నదా ? అది తెలుసుకో, మొట్టమొదట నిన్న నీవు చూచుకో అంటాను' అని అంటున్నారు భగవాన్.

ఆవరణ జీవుని పూర్తిగా కప్పివేయదు. తానున్నానని అతనికే తెలుసు. అతనికి తెలియనిదెల్లా తాను ఎవరు అనేది. అతడు ప్రపంచాన్ని చూస్తాడు. కాని అది బ్రహ్మమే అని ఎరుగడు. ఈశ్వరుని మీరి జీవుడు, మాయను మీరి అజ్ఞానము ఉండలేవు. నిద్ర నుండి మేల్కొన్న పిదపే వ్యక్తి దేహాన్ని జగత్తునూ చూస్తాడు. నిద్రలో కాదు. ఇప్పటి ఎరుక ఆధారంగా, నిద్రలోనూ తానున్నాని గ్రహిస్తాడు. కాబట్టి నిద్ర జీవుని శుద్ధ స్థితిగానే అంగీకరించాలి. ఆ స్థితిలో ప్రపంచమూ, శరీరమూ రెండూ కనిపించవు అంటారు మహరి&ష.

యోగం ఒక సాధన. జ్ఞాన ప్రాప్తి తర్వాత యోగంతో పనిలేదు. అన్ని సాధనలకూ యోగమనే పేరు. కర్మయోగము, భక్తియోగము, జ్ఞానయోగము, అష్టాంగయోగము. యోగమంటే ఐక్యము. వియోగముంటేనే యోగం సాధ్యపడుతుంది. ఇప్పుడు తాను వియోగముతో ఉన్నానని వ్యక్తి భ్రమపడుతున్నాడు. అసలు ముందు ఈ భ్రాంతిని తొలగించాలి. ఆ లొగించే పద్ధతినే యోగమన్నారు.

ప్రతివాడూ పూర్వజన్మల సంస్కారంతో జన్మిస్తాడు. ఏ విధానం ఉత్తమము అనేది ఆ వ్యక్తి మనస్థితిని బట్టి ఉంటుంది. ఒకరికి ఒక పద్ధతి అనువయినది అయితే, మరొకరికి ఇంకొక పద్ధతి నచ్చుతుంది. దాని గూర్చి నిశ్చయంగా ఇదే ఉత్తమమయినది అని చెప్పటానికి వీలుపడదు అన్నారు మహర్షి.

భగవంతునికి చేసిన నివేదన నిస్వార్థాన్ని సూచిస్తుంది. నిష్కామకర్మ అర్థమదే. నిజమయిన త్యాగమది. ఏదయినాసరే, యిష్టపడి ఇచ్చినప్పుడు, అది పుచ్చుకునేవారికి, ఇచ్చేవానికి కూడా సంతోషదాయకమవుతుంది. అదే ఎవరయినా దొంగిలించినా, ఇష్టం లేకుండా, తప్పనిసరి అయి ఇచ్చినా అది ఇరువురికి చింతాకరమే. దానం, ధర్మం, నిష్కామకర్మం అన్నీ త్యాగమే. మమతను విసర్జిస్తే చిత్తశుద్ధి, అహమును విడిచివేస్తే జ్ఞానము. ఇచ్చే గుణము బాగా పెరిగితే అది జ్ఞానానికి తెచ్చి చేరుస్తుంది అంటారు భగవాన్.

కోరుకోవటం అంటూ మొదలుపెడితే ఇక కోరికలకు అంతం అంటూ ఉండదు. కోరికలు నెరవేరేకొద్దీ ఇంకా క్రొత్త కోరికలు పుడుతూనే ఉంటాయి. తృప్తి అనేది ఉండదు. కోరుకోవటం మానివేస్తే, ఏది పడితే అది వస్తుంది. భార్య, సంతానం, ఉద్యోగం . . .

**ఆలోచనలు ఉన్నతమైతే - ఆచరణ మహోన్నతమగును**

వీటన్నిటిలో మనంలేము. మనలోనే అవన్నీ ఉన్నాయి. అవి రావటం, పోవటం మన చేతిలోనూ, మన వశంలోనూ, లేవు. అవి ప్రారబ్ధవశంగా వచ్చిపోతాయి.

మనస్సు నిశ్చలయితే, ప్రపంచం కనిపించినా, కనిపించకున్నా అది సమాధి.

పరిసరాలు, కాలము, విషయములు, అన్నీ నాలో ఉన్నాయి. విషయాలను నామ రూపములను బట్టి వేర్వేరుగా విభజింపవచ్చును. ప్రతి పేరు ఒక్కగానొక్కటే. అదే 'నేను'. ఎవరిని అడిగినా 'నేను' అంటాడు. తన్ను గూర్చి చెప్పేటప్పుడు కూడా 'నేనే' అంటాడు. అతడు ఈశ్వరుడయినా సరే ఆయన పేరు కూడా 'నేనే'. ఉపాధి విషయము కూడా అంతే. దేహాత్మ బుద్ధి ఉన్నంతవరకూ, ఆవాసమొకటి నిర్దిష్టమే. ఆ బుద్ధి అలాకాకుంటే ఉపాధి మాటే రాదు. నేనేమి దేహమునా? దేహము ఎప్పుడయినా తన్ను తాను 'నేను' అని ప్రకటించు కుంటుందా? ఇవన్నీ నాలో ఉన్నాయి అనటం స్పష్టమే. వీటనన్నింటినీ నిర్మూలించి వేయగా, మిగిలియున్న 'శాంతి', 'నేను'. దీనినే సమాధి అంటారు.

భగవాన్ గతంలో జరిగిన ఒక సంఘటన స్మృతిలోనికి తెచ్చుకొని 'ఒకరోజు ఉదయాన్నే విరూపాక్ష గుహ వద్ద ఆరుబయట కూర్చొన్నాను. అవి బాగా చలిరోజులు. జనం వచ్చేవారు, చూచి వెళ్ళేవారు. ఆంధ్రప్రాంతం నుండి వచ్చిన కొందరు భక్తులు కొబ్బరికాయలు కొట్టి ఆ నీళ్ళు నా నెత్తిమీద గుమ్మరించారు. చలితో గడగడా వణికిపోయాను. వారి దృష్టిలో అది పూజ. నేను రాతి విగ్రహాన్ని అనుకున్నారు' అంటూ వారి మూఢభక్తిని వివరించారు.

అరుణాచలము యొక్క ప్రత్యేకతను చెపుతూ భగవాన్ అంటారు. 'నవద్వారే పురే దేహే' అని శరీరం గురించి చెప్పినట్లుగా, ఈ ఊరు ఒక విచిత్రమయినది. రైలు మార్గం మినహాయిస్తే ఇక్కడికి చేరుకోవటానికి తొమ్మిది దారులున్నాయి.

ఫల ప్రదానంలో ఉపాసనా విధానాలు అన్ని సమానాలేనంటారు మహర్షి. ఎవరెవరికి పూర్వజన్మ వాసనలను బట్టి వారికి ఆ ఉపాసనా మార్గం సులువుగా అనిపిస్తుంది. దానినే వారు అనుసరిస్తారు. ఊరకే ఉండేదెట్లా ? అలా ఉండటం చాలా మందికి కష్టంగా ఉంటుంది. దాని కోసం యోగమభ్యసించాలా అని కొందరు అడుగుతారు. కష్టం కానిది వారికి కష్టంగా అనిపిస్తోంది. ఒకరికి బాగా తిరగటం అలవాటు. వానికి ఊరికే ఇంట్లో కూర్చుని ఉండమంటే అది వానికి చాలా కష్టంగా అనిపిస్తుంది.

*(సశేషం)*

**అహంకారము పతనానికి మూలము**

సందేశ భారతి

# గురుదేవుల నిజమైన సందేశం

(గత సంచిక తరువాయి)

**ఆంగ్లమూలం - స్వామి చిదానంద** **అనువాదం : తిప్పరాజు కొండల్‌రావు**

గురుదేవులు అందరు నిస్వార్థసేవ చేయాలన్న విషయానికి ఎందుకు ప్రాధాన్యత నిచ్చారు? దానికి ఎన్నో కారణాలున్నా సత్యం మాత్రం ఒక్కటే. తన వద్దకు వచ్చే చాలా మంది వ్యక్తులు తాత్కాలిక ప్రేరణకు, మానసిక ఉద్వేగానికి గురైవచ్చేవారు. వచ్చిన వారిలో అత్యధికులు ధ్యాన సాధనకు అనుకూలమైన వారు కాదు. ధ్యానం వారికి అందని ద్రాక్షఫలం. వారి అంతరంగంలో స్వార్థం, అహంకారం మొదలైన దుర్గుణాలు వ్రేళ్లూని ఉన్నాయి. ముందు వాటిని తొలగించుకోవాలి. మనో మాలిన్యాలను తొలగించుకోకుండా వారు ఎలాంటి ప్రగతి సాధించలేరు. అందుకే వారికి "ధ్యానం చేయండి, సాక్షాత్కారం పొందండి" అని చెప్పలేదు గురుదేవులు. అందుకే వారికి **"నిస్వార్థ సేవలో నిమగ్నమవ్వండి. గురువును, యాత్రికులను సేవించండి. పేద వారిని, రోగ బాధితులను సేవించండి. అతిథులను, దర్శకులను సేవించండి. ఇంట్లో తలిదండ్రులను, వృద్ధులను సేవించండి. ఇరుగు పొరుగు వారిని, సమాజాన్ని, దేశాన్ని, సమస్త ప్రపంచాన్ని సేవించండి. ముందుగా మీ తల్లిదండ్రులకు మంచి కొడుకుగా, కూతురుగా మారండి. తర్వాత ఇతరులకు సేవ చేయవచ్చు"** అని బోధించేవారు.

గురుదేవులు తమ అపారమైన ఆధ్యాత్మిక అనుభవం నుండి తెలుసుకున్నది – చాలా మంది ధ్యాన సాధనకు అనర్హులు. వారి మనస్సులు మాలిన్యాలతో, మురికితో నిండి వున్నాయి. సమస్త మలినాలను తొలిగించి, మనస్సును ప్రక్షాళనచేసి, శుభ్రపరచి వారి హృదయాలను శుద్ధపరచి, నిర్మలంగాచేస్తే తప్ప వారు సాధన చేయడానికి, ధ్యాన సమాధులను చేరడానికి అర్హత సాధించరు. అవి వారికి ఎండమావులే. ఇలాంటి వ్యక్తులకు గురుదేవులు **"ముందుగా మీరు నిస్వార్థసేవచేసి మిమ్మల్ని మీరు శుద్ధపరచుకోండి"** అని బోధించేవారు. వారు ఇతర సాధనలకు అర్హత సంపాదించడానికి ముందు నిస్వార్థసేవ చేయాలని సలహా ఇచ్చేవారు. మనస్సు, హృదయం నిర్మలంగా లేనిది, జపంచేస్తూ వేళ్లుకదులుతున్నా, మాలలు తిరుగుతున్నా, మంత్రజపం చేస్తున్నప్పుడు పెదవులు కదులుతున్నా, మనస్సు మాత్రం అధీనంలో లేకుండా లోకమంతా తిరుగాడుతూ వుంటుంది. అందుకే, మీరు ఏకాగ్రతతో, నిశ్చలమైన మనస్సులో

అందరిని ఆదరించేవారు ఎల్లప్పుడూ ఆనందంగా ఉంటారు

జపం చేయాలన్నా, దాన్ని ప్రయోజనాన్ని పొందాలన్నా నిరంతర నిస్వార్థసేవ ద్వారా నకారాత్మక, అనాధ్యాత్మిక, అదైవిక గుణాలను తొలగించి మీ మనస్సును, హృదయాన్ని నిర్మలంగా వుంచడానికి శ్రమపడాలి. అప్పుడే మీరు చేసే జపసాధన ఫలవంతమౌతుంది.

గురుదేవులు అప్పుడు, ఇప్పుడు, ఎప్పుడూ భవిషద్దర్శి, దైవాంశ సంభూతుడు. గురుదేవులు హిమాలయాల శిఖరాలనుండి ఇలా గర్జించారు. **"ఓ మానవా ! మేలుకో ! మానవ జన్మ అమూల్యమైనది. తినడం, త్రాగడం, నిద్రతో దీన్ని వ్యర్థం చేసుకోకు. తీక్షణమైన యోగాభ్యాసంచేసి భగవత్ సాక్షాత్కారం సాధించడానికే పరమాత్మ ఈ జన్మను నీకు ప్రసాదించాడు. పరమచైతన్య లక్ష్యాన్ని సాధించడమే నీ కర్తవ్యం.** ఇదే నీ జీవితంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ విధి". మీ జీవితంలో ఆధ్యాత్మిక సాధనకు తగిన స్థానం కలిగించడానికే గురుదేవులు ఈ ప్రపంచానికి అరుదెంచారు. ఆధ్యాత్మిక సాధన లేని జీవితం మరణ సమానం, నిర్జీవం. మనందరం సాధనచేసి ఆత్మసాక్షాత్కారం పొందడానికే ఇక్కడికి వచ్చాం. కాని మనం ఈ పవిత్రమైన ఆదర్శాన్ని మరచి సాధనను ఉపేక్ష చేశాం. సాధనకు మన జీవితంలో సరైన స్థానాన్ని కలిగించాలి.

గురుదేవులు యదార్థవాది. అనుభవజ్ఞులు. అందరూ పరిత్యాగ పథాన్ని ఎంచుకోరని వారికి తెలుసు. ప్రజలకు భక్తి, ప్రపత్తులు వుండవచ్చు. కాని వారికి తమదైన కుటుంబం, సాంసారిక బాధ్యతలుండవచ్చు. అందుకే గురుదేవులు అందరికీ ఒక దైనందిన ప్రణాళికను, దినచర్యను నిర్ణయించారు. రోజుకు తమ ఆఫీసుకు, వ్యవహారానికి ఏడుగంటలు, వెళ్ళిరావడానికి ఒక గంట సమయం, సాయంకాలం ఆటపాటలకు, క్లబ్ వెళ్లడానికి టెన్నిస్, బ్యాడ్మింటన్ ఆడడానికి, నడకకు ఒక గంట, ఉదయం సాయంకాలం మార్కెట్ వెళ్లిరావడానికి ఒక గంట కేటాయిస్తూ గురుదేవులు ఇలా సెలవిస్తారు. "ప్రాతఃకాలం 4-00 గంటలకు లేచి, కాలకృత్యాలు తీర్చుకొని జపం, సాధన, ధ్యానం, ఆసన ప్రాణాయామం చేయాలి. భగవద్గీత, రామాయణం, భాగవతం, ఉపనిషత్తులు, యోగవాశిష్ఠలాంటి గ్రంథాలు అధ్యయనం చేయాలి". సాధన, అంతరంగ జీవనం, ఆధ్యాత్మిక జీవనంకు ప్రాధాన్యతనిచ్చారు. దైనందిన సంసారానికి కొంత సమయం కేటాయించి మిగతా సమయాన్ని సాధనకు ఇచ్చారు. మీ సెలవుదినాన్ని పవిత్ర దినంగా మార్చుకో అనేవారు. ఆధునిక మానవునికి సాధన మాత్రమే జీవన ప్రయోజనం అని బోధించే వారు మన గురుదేవులు స్వామి శివానంద. సాధన జీవితంలో అత్యంత విలువైనదని సెలవిచ్చారు. దానికి అధిక ప్రాధాన్యతను ఇవ్వాలని ఎటువంటి పరిస్థితుల్లోనూ సాధనను విడవవద్దని వారించేవారు. తొలి దశలో మనస్సులో, హృదయంలో స్వార్థం,

**లక్ష్యం లేని జీవితం గవ్వతో స్వరూప్యులు**

అహంకారం, అసూయ, అర్ష్య, అసహనం, కోపం, అత్యాశ, ద్వేషం, దురుద్దేశంలాంటి మాలిన్యాలు వుండటంవల్ల మనిషి సాధనకు అర్హుడుకాదు. అందుకే కొంత కాలం నిస్వార్థ సేవలో మునిగిపోవాలని, ఇది జీవన ప్రయోజనానికి తొలి దశ అని ఉద్ఘాటించేవారు.

భరతవర్షం త్యాగం, సాధన, భక్తి, భజన, తపస్సుకు ఆలవాలమైన భూమి. ఇది మన ప్రాథమిక బాధ్యత, ఇది మన వారసత్వం. ఆధునిక మానవుడు తన బాధ్యతను మరచిపోయాడు. పరమాత్మను, జీవన ప్రయోజనమైన భగవత్ సాక్షాత్కారాన్ని మరచిపోయాడు. అందుకే గురుదేవులు అవతరించి మనల్ని మేల్కొలిపి సాధన, యోగా మార్గంలో పయనించమని ప్రేరేపించారు. ఇదే స్వామి శివానంద మానవాళిని అందించిన సందేశసారం. ఆధునిక సమాజానికి గురుదేవులు అందించిన బోధనలలోని సత్యం. ఇది ఆధునిక మానవునికి జ్ఞానబోధ. యోగా, వేదాంత పథంపై నిర్విరామంగా పయనిస్తూ ఆత్మసాక్షాత్కారం పొందడానికి ఆధ్యాత్మిక సాధన ప్రాముఖ్యతను వివరించారు. ఇది గురుదేవుల ముఖ్య సందేశం. చాలా మంది సాధనకు అనర్హులు, వారికి 'మంచిగా ఉండు, మంచిని చేయి' అని సలహా.

కొందరు సాధకుల మనస్సులో ఒక సందేహం కలిగిన ఈ విధంగా ప్రశ్నించవచ్చు. "నేను చాలా కాలం వరకు కఠినంగా నిస్వార్థ, నిరంహకార సేవలనందించిన తర్వాత నా మనస్సు శుద్ధమై భక్తి కలుగుతుంది. నేను యోగ సాధన, వేదాంత సాధనలాంటి సాధనలను చేయగల సామర్థ్యం లభిస్తుంది. మంచిగా వుండటం, మంచిని చేయడం, నిస్వార్థసేవ ఈ ప్రక్రియలన్నింటి ప్రయోజనం పూర్తి అయ్యింది. నేను వీటిని వదలి పెట్టి ప్రత్యేకంగా జపం, ధ్యానం లాంటి సాధన చేయవచ్చు?". ఈ ప్రశ్నలో మంచిగా వుండటం, మంచిని చేయడం వదలి పెట్టేలా అన్న అర్థం వుంటే దాని జవాబు ఖచ్చితంగా కాదు. మంచిగా వుండాల్సిందే మంచి చేయాల్సిందే. మంచిది కానిది ఏదీ చేయవద్దు. నీ చివరి శ్వాస వరకు మంచిగా వుండాలి, మంచిని చేయాలి. ఇది నీ జీవితానికి ఎంతో అవసరం".

గురుదేవుల అవతార ప్రయోజనాన్ని పూర్తిగా అర్థం చేసుకోలేక గురుదేవులు నిస్వార్థ సేవను బోధించడానికి వచ్చారు అని తలిస్తే మీరు గురుదేవులను తప్పుగా అంచనా వేసినట్టే. ఆధ్యాత్మిక చింతనలేకుండా, స్వార్థంతో ఎలాంటి ఉత్తమ లక్ష్యాలు లేకుండా జీవించే వారికే నిస్వార్థ సేవ. "మీకు నిస్వార్థ సేవయే విమోచనం. సర్వం వదిలి నిస్వార్థ సేవలో మునిగిపోండి". ఈ సలహా సాధకులకు, భక్తులకు, తమ ఆధ్యాత్మిక లక్ష్యాన్ని నిర్ణయించుకున్న వారికి కాదు. ప్రపంచంలో సాధనకు పాలుపడని అధికులకు నిస్వార్థ సేవను చేయమని సందేశాన్ని

అందించారు. "ఇతరుల కొరకు ఎవరు జీవిస్తారో, వారే బ్రతికివున్నారు. మిగతా వారు బ్రతికి వున్నా మృతప్రాయులే' అన్నారు స్వామి వివేకానంద.

నిస్వార్థసేవ లౌకిక మానవులకు మాత్రమే. అయితే గురుదేవుల సాంగత్యం పొందడంవల్ల, వారి రచనల సాంగత్యంవల్ల మనం ఆ వర్గానికి చెందిన వారం కాదు. సంపూర్ణత్వం సాధించిన మునిపుంగవుని రక్షణలో వున్నాం.

**శ్లో॥ దుర్లభం త్రయమే వైతద్దేవానుగ్రహ హేతుకమ్ ।**
**మనుష్యత్వం, ముముక్షత్వం, మహాపురుష సంశ్రయః ॥** (వివేక చూడామణి-3)

– మనుష్య జన్మ, ముముక్షత్వం కావాలన్న జిజ్ఞాస, మహాపురుషుల సంరక్షణ – ఈ మూడు అమూల్యమైననవి భగవంతుని అనుగ్రహంవల్లనే లభిస్తాయి.

మనం ఇక్కడికి ఎందుకు వచ్చామో మనం ఏమి సాధించాలో – ఈ విషయంలో జగద్గురువు శంకరాచార్యులు చాలా స్పష్టంగా వున్నారు. మనందరం గురుదేవుల్లాంటి మహయోగి సంరక్షణ సాధించి ఆత్మసాక్షాత్కారానికి ప్రయత్నం చేయకుంటే దానికన్నా దుర్దశమరేది లేదు. గురుదేవులు మనకు నూటికి నూరుపాళ్లు స్వచ్ఛమైన ఆధ్యాత్మిక బోధనలను అందించారు. మనమంతా వారి పాద పద్మాలవద్దకు చేరి వారి ఆధ్యాత్మికంగా సందేశాన్ని పూర్తిగా అర్థం చేసుకోలేకపోతే, ఎంత మంచిదైనా సామాజిక సేవలో మాత్రమే నిమగ్నమైపోతే అదొక గొప్ప పొరపాటు. ఆ సామాజికసేవ ఎంతటి మహత్తరమైనదైనా, దాన్ని నీవు మాత్రమే చేయగలవు అని భావిస్తే అది అత్యంత సూక్ష్మమైన అహంకారం.

ఈ అధునిక కాలంలో గురుదేవులు అవతరించడానికిగల ప్రయోజనాన్ని సంక్షిప్తంగా వర్ణిస్తాను. "నేను యోగా వేదాంతం నేర్పడానికి ఈ ప్రపంచంలోనికి వచ్చాను". "నిజమైన సాధన చేయండి నా పాపల్లారా, నిజమైన సాధన చేయండి. ఈ మానవ జన్మ మళ్ళీ లభించకపోవచ్చు. ఈ సువర్ణ అవకాశాన్ని వదలి తర్వాత పశ్చాత్తాప పడవద్దు. ముఖ్యంగా సాధనలో నిమగ్నం అవ్వండి".

"ఈ కలియుగంలో మోక్షం సాధించడానికి ఏకైక మార్గం భగవన్నామం. మరో దారేలేదు". గురుదేవులు, ఆధ్యాత్మిక జీవితమే ముఖ్యమనీ, లౌకిక జీవనం కాదనీ తెలియజేయడానికే ఈ లోకానికి వచ్చారు. ఉన్నత సాధన చేయలేనివారికి "సరే ! మీ జీవితాన్ని వృధా చేసుకోకండి. మీరు సాధన చేయలేకుంటే కనీసం సంపూర్ణ నిస్వార్థ సేవ చేయండి. "అయితే సాధకులకు, శిష్యులకు, భక్తులకు ఒకే ఒక సందేశం" నిజమైన సాధన చేయండి. సాధనలో నిమగ్నం కావాలి".

**ఎంత కోల్పోయినప్పటికీ భవిష్యత్తు మిగిలే ఉంటుంది**

ఉన్నతమైన సాధనకు నిష్కామ కర్మయోగమే ఆధారం. అయితే మీరు ఆధారాన్ని మాత్రమే నమ్ముకొని మిగతా భవన నిర్మాణం చేయకపోతే మీరందులో నివసించలేరు. అది మీకు రక్షణ కల్పించదు. ఆధారం మాత్రమే భవనం అన్న భ్రమలో వుండవద్దు. ఆధారం అత్యంత ముఖ్యమైన భాగమే కాని దానిపైననే కూర్చొని వుంటే భవన నిర్మాణాన్ని విస్మరిస్తారు. కాశీలో దానంచేసి పుణ్యంగడించాలనే తపనతో విశ్వేశ్వరుని దర్శనాన్ని పొందలేని భక్తుడిగా మిగిలిపోతావు.

గురుదేవుల ఆవిర్భావం త్యాగం, తపస్సు, విరక్తి, సాధనను నేర్పడానికే అన్న విషయాన్ని మనందరం స్పష్టంగా అర్థం చేసుకోవాలి. మనకు సాధనను నేర్పడానికే వచ్చాడు. మంచిగా వుండు, మంచిని చేయి అన్నది సాధనకు సన్నాహం, సాధనకు రక్షణ. ఆధ్యాత్మిక సాధన శ్రద్ధగా ప్రారంభించిన తర్వాత దాని ఫలాలు రావడం ఆరంభమైతే, వాటిని సంరక్షించుకోవడానికి సాధనను దృఢ పరచడానికి, మంచిగా వుండడం, మంచిని చేయడమే ఆ ఫలాల సంరక్షణామార్గం. ఇది నీ కంచె, నీ రక్షణకవచం, అదే సాధనను పురోగమించేలా, వెనక్కి జారిపోకుండా కాపాడుతుంది. ఇదే మంచిగా వుండడానికి, మంచిని చేయడానికి ; ఆత్మ సాక్షాత్కారానికిచేసే సాధనకుగల ఆత్మీయ సంబంధం.

తొలిదశలో మంచిగా వుండడం, మంచిని చేయడం అవసరమైన అభ్యాసం. తర్వాతి దశలో అది రక్షణ కవచంగా మారుతుంది. మీరు భగవత్ సాక్షాత్కారం పొందిన తర్వాత కూడా మంచిగా వుంటారు, మంచిని చేస్తుంటారు. అది మీ దివ్యత్వంగా, స్వభావంగా మారుతుంది. భగవంతుడు నిరంతరం తన సృష్టిపై తన అనుగ్రహం, ప్రేమ, దయ, కరుణ వర్షిస్తూ వుంటాడు. మీరు భగవంతునితో మమేకమైతే ఆ దివ్యగుణాలు మీ ద్వారా ప్రవహిస్తాయి. అందుకే ప్రతి స్థాయిలో మంచిగా వుండు, మంచినిచేయి అన్న బోధనకు ఒక ప్రత్యేక స్థలం వుంటుంది. తొలిదశలో అదొక సన్నాహం ; ఆధ్యాత్మిక జీవనంలో, సాధనలో అదొక రక్షణ. చివరిగా అది మీ దివ్యత్వం యొక్క ప్రత్యక్ష ప్రదర్శన.

*సమాప్తం*

హరిః ఓం

**ఎవరి హృదయం మరీ మరీ మృదువుగా అంటే సుమకోమలంగా మారుతుందో వారి జీవితం ప్రగతిశీలంలో ఉందని అర్థం. ఎవరి రక్తం, ఉష్ణం, మస్తిష్కం సచేతనం అవుతూ నడుస్తుంటాయో, వారి ఆత్మ శాంతివైపుగా ప్రగమిస్తూ ఉంటుంది**

**ప్రచారం కన్నా - ఆచరణ మిన్న**

పర్వ భారతి

# విజయీ భవ!

**- ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి**

ఏటావచ్చే విజయదశమి (దసరా) మళ్లీ వచ్చింది. (ఈ ఏడు విళంబి నామ సం॥ర ఆశ్వయుజ శుద్ధదశమి) దానికన్నా ముందు జరిగే నవరాత్రి ఉత్సవాలూ జరిగాయి. దుర్గాదేవి కొలుపులూ జరిగాయి. మవమి కోలలూ వెళ్లాయి. భజన పరులు చిందులు వేశారు. వీధుల్లో – అక్కడక్కక కొన్ని గ్రామాల్లో యక్షగానాలు, చిఋతల రామాయణాలు ఆడారు, పాడారు. చాలా ప్రదేశాల్లో ఎడ్లపందాలు, కోళ్లపందాలు, బండ్ల పందాలు జరిగాయి. చిఱ్ఱగెన, కోలాటం. ఆ ఆటా, ఆ పాట, అంతటా సంరంభాలు జరిగాయి. సంబరాలు జరిగాయి. హరికథలు, పురాణ ప్రవచనాలు అంతటా వినిపించాయి.

ఇది ఈ ఒక్క సంవత్సరమే కాదు. ఏటా జరుగుతన్నదే ! పిండివంటలు, కొత్తబట్టల కంటే పై కార్యక్రమాలన్నీ మనిషికెంతో ఉత్సాహాన్నిస్తాయి.

అయితే పండుగ సందేశం కూడా ప్రతి వ్యక్తి. తప్పకుండా తెలుసుకోవాలి. ఉదాహరణకు ఈ నవరాత్రి ఉత్సవాల్లో దుర్గా పూజలు జరుగుతాయి. ఎందుకు జరుగుతాయో తెలుసుకోవాలి.

ఆ దుర్గా దేవే ఆదిశక్తి. ఆ తల్లే మహామాయ. ఈ తల్లికే మహాకాళి అని పేరు. ఈ అవతారంలోనే తల్లి మధుకైటభులనే రాక్షసులను సంహరించింది.

ఈ తల్లి రెండవ అవతారం మహిషాసురమర్దని. సింహవాహనయైన ఈ తల్లికి మహాలక్ష్మి అని పేరు. ఈ తల్లే మహిష ముఖుడైన అసురుణ్ణి సంహరించింది.

మూడవ అవతారంలో ఈ తల్లికి మహాసరస్వతి అని పేరు. ఈ అవతారంలోనే అమ్మవారు శుంభ నిశుంభులను, రక్త బీజుణ్ణి చంపి వేసింది.

నాల్గవ అవతారంలో తల్లినందునింట నందగా (యోగమాయగా) జన్మించి, కంసుణ్ణి హడలగొట్టి అదృశ్యమైపోయింది.

స్వార్థం అనర్థదాయకం

అయిదవ అవతారంలో రాక్షస సంహారానికి అమ్మవారు దంతాలనే ఉపయోగించినందువల్ల అప్పటి నుండి రక్తదంతిగా ఆ తల్లికి పేరు వచ్చింది.

లోకంలో కరువుకాటకాలెక్కువైపోవడంతో తల్లి అంతటా శాకాలు సృష్టించి కరవు తొలగించింది. అందువల్ల ఆ తల్లి ఆరవ అవతారంలో శాకంభరిగా పిలువబడింది.

దుర్గుడనే రాక్షసుణ్ణి అమ్మవారు ఏడవ అవతారంలో సంహరించింది. ఆ కారణంగానే తల్లికి దుర్గ అని పేరు వచ్చింది.

స్థ

ఎనమిదవ అవతారంలో తల్లి మతంగుని యింట పుట్టింది. అందువల్లనే మాతంగి అని పిలువబడింది.

తొమ్మిదవ అవతారంలో రాక్షస సంహారం నిమిత్తం అమ్మవారు భ్రమరాలను సృష్టించి విజయం సాధించింది. అందువల్ల తల్లికి ఈ అవతారంలో భ్రామరి అనే పేరు వచ్చింది.

జగదీశ్వరి, జగజ్జనని, లోకపావని అయిన ఆదిశక్తి లోకంలోని మాతృజీవశక్తికి మూలాధారం. సర్వసృష్టికి మాతృశక్తే మూలాధారం.

తెలంగాణా ప్రాంతంలో ఎక్కువగా జరుపుకొనే పండుగైన 'బ్రతుకమ్మ' వెనుక కూడా ఇదే తత్త్వముంది. ఈ పండుగలో స్థానిక కథలు, స్థానిక సంప్రదాయాలు ఎన్ని కలిసినా ఈ ఉత్సవం వెనుక కూడా ఆదిశక్తి తత్త్వమే ఉంది. తల్లి బతుకునిచ్చే తల్లి అనీ, అందరినీ బతుకమని ఆ తల్లి కోరుతుందని ఈ పండుగ వెనుక ఉన్న అంతరార్థం.

ఆ తర్వాత జరిగే విజయ దశమి ఉత్సవం వెనుక కూడా ఇవే అంతరార్థాలున్నాయి. రావణ సంహారం, విజయుని ఆవుల మళ్లింపు, హిందూ రాజుల జైత్రయాత్రలు, ఇలా ఎన్నో విజయదశమి వైశిష్ట్యాన్ని మరీ పెంచాయి. విజయదశమి మన విజయ సంకేతం. అన్ని రంగాల్లో మనం, మనదేశం, మనజాతి, మన సంస్కృతి విజయాలు సాధించి, జ్ఞాన భిక్షనూ అన్న భిక్షనూ పెట్టి ఎదగాలనే ఈ పండుగ పరమార్థంగా భావించాలి.

✶

**ధర్మరాజువలే కండి, దుర్యోధనుడిలా కాదు.**
**ధర్మరాజుకు ఇతరులలో చెడు కనిపించేదికాదు,**
**దుర్యోధనుడికి ఇతరులలో మంచి కనిపించేదికాదు.**

**మనిషి తెలుసుకున్నది రవ్వంత - తెలుసుకోవలసినది కొండంత**

## గేయ భారతి

# గావోహి విశ్వస్య యోగ మాతరః

- యోగరత్న డా॥ శశిరేఖారెడ్డి

1) సర్వ దేవవాసం దేహం విశ్వస్య గోమాతరం
దివ్య ఔషధగుణోపేతం హి పంచగవ్యం
అష్టాంగ యోగమతం తవ సేవా విధానం
కరిష్యే సాష్టాంగ ప్రణిపాతం

2) దుగ్ధం, దధి, నవనీతం, ఘృతం చ
ఆమోదకరమ్ ఆయురారోగ్య వర్ధకం
తవ పవిత్రం గోమాత, ప్రాశనం
నిత్యం కరోతి రోగనిర్మూలనం

3) గోసేవాకార్యేషు భవతి యోగాభ్యాసం
యమ, నియమాసన ప్రాణాయామ పాలనం
సత్య, అహింస, శౌచ, సంతోష సోపానం
ప్రసరతి మనఃశాంతి ఈశ్వర ప్రణిధానం

4) కృపాసాగరి శాంతి మూర్తి విశ్వంభరా మాతా
వివిధ జలవాయు పర్యావరణ ప్రదూషణహర్తా
ప్రాతఃకాలే కామధేను దర్శన భాగ్య సేవా
దదాతి ఇంద్రియనిగ్రహ యోగ క్షేమ సపూర్ణా

5) విశ్వజన మానస క్షేత్రే నశ్యతు యుద్ధకామనా
ప్రసరతు జగతి దివ్యజ్ఞాన ఐక్య భావనా
కరోతు నిత్యం సర్వేఽపి యోగ సాధనా
గా వో తథా వృషోహి భగవాన్ ధర్మస్వరూపా . . .

✶

**తక్కువ మాట్లాడు ఎక్కువ పని చేయి**

# శ్రీ ఆంజనేయం

సంకలనం : స్వామిని శారదా ప్రియానంద

(గ్రంథం శ్రీ చిన్మయ స్తోత్ర భజనమాల)

పల్లవి॥ శ్రీ ఆంజనేయం అంజనికుమారం
వాయుకుమారం వానర వీరం ॥శ్రీ॥

రాజా రామం నమో నమో
సీతా రామం నమో నమో
మారుతి రామం నమో నమో
వానర వీరం నమో నమో ॥శ్రీ॥

శంకర సంభవ నమో నమో
సుగ్రీవ సచివా నమో నమో
శ్రీరామ దూతా నమో నమో
సంజీవ రాయ నమో నమో ॥శ్రీ॥

దైత్యకులాంతక నమో నమో
లంకా దాహక నమో నమో
అక్ష హంతకా నమో నమో
ఆర్తి వినాశక నమో నమో ॥శ్రీ॥

వజ్ర శరీరా నమో నమో
వారధి లంఘున నమో నమో
సింహిక భంజన నమో నమో
శ్రీ హనుమంతా నమో నమో ॥శ్రీ॥

మనం దైవ సృష్టి - ధనం మానవ సృష్టి

ప్రార్థన భారతి

# హనుమాన్ చాలీసా - 17

- అను, వ్యాఖ్య : ఆచార్య కసిరెడ్డి

**హిందీ : తుమ్హరో మంత్ర విభీషణ మానా ।**
**లంకేస్వర భయే సబజగజానా ॥**

**తెలుగు : నీదుమంత్రాలోచనమున గద విభీషణుడు**
**లంకేశ్వరుండయ్యె జగమెరుగ భూషణుడు**

**భావం :** నీ పరమోత్తమ మహామంత్రాన్ని విభీషణుడు గ్రహించాడు. ఈ కారణంగానే అతడు లంకకు రాజయ్యాడు (లంకేశ్వరుడయ్యాడు). ఈ విషయం ప్రపంచంలోని అందరికీ తెలుసు.

**వ్యాఖ్య :** ఆంజనేయుని మంత్రమేది ? శ్రీ ఆంజనేయం ప్రసన్నాంజనేయమా ! శ్రీ ఆంజనేయం అంజనీ కుమారమా ! వీరమారుతీ – గంభీర మారుతియా ! అంజని పుత్ర జయహనుమాన్ ! అతి బలవంత జయహనుమాన్ అని !

2) రోమ రోమమున రామ నామమే నిండెనటు, శ్రీరాముడు నీ గుండెలో కొలువు తీరియుండునట !

3) ఆంజనేయ స్వామికి ప్రాణమంత్రం/అయోధ్యాపతి తిరునామ మంత్రం/ఆద్యంతములు లేని అనశ్వరమంత్రం/అంబికాపతి నిత్యం స్మరించు మంత్రం/తారకమంత్రం శ్రీరామమంత్రం, తిరునామ మంత్రం/రామరామరామ్ రామరామరామ్/ రామరామరామ్ శ్రీరామ రామ రామ్॥

ఈ మంత్రాల్లో మొదటి రెండు మనం ధ్యానం చేయాలి, ఉచ్చరించాలి. మూడవ మంత్రం ఆంజనేయ స్వామిదే ! ఆయన ధ్యానం చేస్తాడు, మనమూ చేయాలి. విజయం కలుగుతుంది.

మంత్రం అంటే ఆలోచన కూడా. ఆంజనేయుని మంత్రం (ఆలోచన) వల్ల విభీషణుడు లంకేశ్వరుడయ్యాడు ! జపించడం వల్ల కావచ్చు. అతని గుణముల వల్ల కావచ్చు. శ్రీరామ చంద్రుని ఔదార్యంవల్ల కావచ్చు.

✶

త్యాగము అదృష్టమునకు ఆధారము

బోధనా భారతి

# జీవుడా మేలుకో!

- బ్రహ్మలీన శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వామి

1) కష్టసుఖముల నోర్చుకోరన్నా
ద్వంద్వంబులన్నియు, ధీరబుద్ధితో గెలుచుకోరన్నా
పొగడినప్పుడు పొంగిపోకను
తిట్టినప్పుడు క్రుంగిపోకను
ఎట్టిస్థితిలోనైన నీవు
దృష్టిసమముగ నిల్పియుండుము
తత్త్వసారము తెలిసికోరన్నా
సద్గురుని చెంత, నిజము గనుగొని లాభమొందన్నా !

బెలూన్ గాలితో నిండినపుడు ఉబ్బిపోవును. గాలి తొలగిపోగానే కుంచించుకొనిపోవును. అజ్ఞాని యొక్క స్వభావము కూడ అటులనే యుండును. అభిలషిత పదార్థములు, ఇష్టవస్తువులు, ప్రియజనులు లభించినపుడు, లేదా ఎవరైనను స్తుతించినపుడు పొంగిపోయి తాను ఎంతయో అదృష్టవంతుడనని, సుఖవంతుడనని యెంచి మురిసిపోవును. ఇష్టపదార్థములు లభింపనపుడు, లేదా ఎవరైనను కఠినముగ మట్లాడినపుడు, తిట్టినపుడు క్రుంగిపోయి, దీనుని వలె, ఉద్విగ్న మానసుడై విలపించును.

వివేకవంతులైన మానవులు, ఆధ్యాత్మిక శిఖరములను అధిరోహించదలచిన ముముక్షువులు కష్టసుఖములందు, నిందాస్తుతులందు, లాభాలాభములందు సమత్వమును అలవరచుకొనవలెను. చంచలత్వము వలన, రాగద్వేషాది వికారముల వలన జనులు శాంతిని పొందజాలరు. "సమత్వం యోగఉచ్యతే" అను గీతావాక్యముననుసరించి సుఖదుఃఖములందలి సమత్వమే, జయాజయము లందలి సమబుద్ధియే యోగము.

కాబట్టి ఓ జీవుడా ! మేలుకో ! వాయుతరంగములవంటి కష్టసుఖములకు, నిందాస్తుతులకు చెట్టు యొక్క ఆకువలె చపలత్వమునకు, వికారములకు లోను కాకు. ఇష్టవస్తు ప్రాప్తి. అనిష్టవస్తునివారణలందే కాలమును వృథాచేయకు. యథాప్రాప్తములగు న్యాయార్జిత అన్న పానాది వస్తువులతో సంతుష్టినొందు. శాస్త్రనియత కర్మలను ఆచరించు.

ధర్మము యొక్క నిజమైన అర్థం "ధారణ" (ఆచరణ)

ఎట్టిస్థితి యందైనను సమస్థిని, బ్రహ్మనిష్ఠను కాపాడుకో. నిరంతర ఆత్మాను సంధానపరుడవై అచంచల గురుభక్తి, దైవవిశ్వాసము గలిగి జీవితమును గడుపు. యోగారూఢస్థితిని, గుణాతీతస్థితిని. సంపాదించు. ధన్యుడవు కా !

**2) ఎన్నిజన్మలుగడచెనోరన్నా**
**బహుకాలమందున, జీవితంబులు అంతమగునన్నా**
**అన్ని హంగులతోను గూడిన**
**ఉత్తమంబగు జన్మనొందియు**
**తన్ను తాను తెలిసికొనక**
**కన్నమూసిన జన్మవ్యర్థము**
**తత్త్వసారము తెలిసికోరన్నా**
**సద్గురుని చెంత, నిజము గనుగొని లాభమొందన్నా !**

సృష్ట్యాది నుండి జీవునకు ఇప్పటివరకు పెక్కు జన్మలు గడచినవి. దేవతా జన్మ, కీటకజన్మ, జంతుజన్మ, రాక్షసజన్మ ఇట్లు కర్మానుసారము ఎన్నియో శరీరములను పొందెను. ఆయా జన్మలందు భార్యపుత్ర బంధుమిత్ర ధనధాన్యాదుల యెడల మోహముచే, కామక్రోధాది దుర్గుణములకు వశుడై నాశము బడసెను. ఇదంతయు చక్కగా విచారణ సలిపి విజ్ఞుడైన మనుజుడు ఉత్తమమైన నరజన్మను బంధవిముక్తి కొరకై, దుఃఖనివృత్తి కొరకే, సంపూర్ణశాంతి ప్రాప్తికొరకే వినియోగించి జన్మపరంపరలకు పూర్ణవిరామమును పెట్టవలెను. స్వస్వరూప సాక్షాత్కార మొందుటకు సకల సదుపాయములుగల ఈ భూలోకమందే , ఈ మానవజన్మల యందే స్వాత్మజ్ఞానము నొందుటకై తీవ్ర ప్రయత్నమాచరించవలెను. తన యొక్క నిజస్వరూపమును ఎఱుగక కేవలము లౌకికవ్యవహారమందే కాలము గడిపి, కన్నుమూసినచో అతని సంసార దుఃఖము శమించదు. కర్మచక్రమందు తగుల్కొని మరలమరల అతడు జన్మాది దుఃఖములను పొందవలసియుండును.

కనుక ఓ జీవుడా ! మేలుకో ! అధికపుణ్యము నొసంగి అమూల్యమగు ఈ నరజన్మను సంపాదించితివి. సద్గురుమూర్తిని శరణుపొందు. జన్మరాహిత్యమునకు, దుఃఖశాంతికి మార్గము తెలుసుకో. ఇప్పటికే ఎన్నియో జన్మలందు విషయ భోగములను అనుభవించితివి. కాని తృప్తి కలుగలేదు. ఆశలు చావలేదు. దుఃఖము పోలేదు. మరల ఇప్పుడును విలువైన మానవజన్మను ఏల వ్యర్థపరచుచున్నావు ? జాగరూకుడవుకా. స్వస్వరూపమును గురించి శ్రవణ మనననిది ధ్యాసాదులను సలిపి జన్మచక్రము నుండి, దుఃఖప్రవాహము నుండి విముక్తుడవు కా. పరమానందమనుభవించు.

✶

**పేరు ప్రతిష్ఠల త్యాగమే గొప్ప త్యాగము**

# ప్రపంచంలోని ప్రధాన మతాలు - వాటి వివరాలు

ఆంగ్ల మూలం : స్వామి శివానంద అనువాదం : ఆకుల రామయ్య

దివ్య జీవన సంఘం స్థాపకులు సద్గురు స్వామి శ్రీ శివానంద సరస్వతీ మహారాజ్ ఋషీకేశ్‌లో, సర్వమత సమ్మేళనాన్ని 1953 సం॥లో ఏర్పాటు చేశారు. ఆ సభకు ప్రపంచంలోని అన్ని మతముల పెద్దలను ఆహ్వానించి, వారి చేత ప్రవచనాలు ఇప్పించారు. ప్రధానమైన మతాల ప్రతి నిధులతో చర్చించి, విశ్వశాంతికి అవగాహన కల్పించి, విశ్వశాంతికి దోహదం చేశారు. ఆ విధంగా, ప్రపంచంలోని అన్ని మతముల సారాంశాన్ని క్రోడీకరించారు. ఆయా మతాల సారాంశము చదవండి.

**1) హిందూ మతము :-** నిన్ను నీవు నీ ఆత్మగా తెలుసుకొని, ఈ ప్రాపంచిక బంధముల నుండి విముక్తుడవుకమ్ము.

**2) క్రైస్తవ మతము :-** స్వర్గలోక సామ్రాజ్యము నీలోనే ఉన్నది.

**3) ఇస్లాం మతము :-** అల్లాయే తప్ప భగవంతుడు లేడు. మహమ్మద్ అల్లా యొక్క ప్రవక్త (ప్రబోధకుడు).

**4) బౌద్ధ మతము :-** అంతా అశాశ్వతమే. ఏదీ శాశ్వతం కాదు. విశ్వమంతటికీ ఇదే చట్టము (సత్యము).

**5) జైనమతము :-** హింసలేకుండా ఉండునది మాత్రమే నిజమైన మతము.

**6) జోరాష్ట్రియన్ మతము :-** ఆలోచనలు, మాటలు, పనులు పవిత్రంగా ఉండుటయే మతం యొక్క సారాంశము.

**7) యూదు మతము :-** నేను అదియే అయి ఉన్నాను. (నేను ఆ దైవమునే అయి ఉన్నాను).

**8) తాయి మతము :-** తనను తాను (అధిగమించిన వాడే) జయించినవాడే అమితమైన శక్తిమంతుడు.

**9) కన్ ఫ్యూసియస్ మతము :-** ఇతరులను నీవు నిందించు విధంగా, నిన్ను నీవు నిందించుకో. నిన్ను నీవు క్షమించుకొను విధంగా ఇతరులను క్షమించుము.

మంచి ఆలోచనలు తరగని సంపదలు

**10) సిక్కు మతము :-** భగవంతుడు ఒక్కడే. అతని పేరు సత్యము. గురువు అద్భుతమైన వాడు.

**11) సూఫి మతము :-** ఆ యథార్థమును నేనే. (అద్వైవమును నేనే).

**12) శింటో మతము :-** చెడును (కీడు) చూడకు. చెడును వినకు. చెడు మాట్లాడకు.

**దివ్యజీవనము :-** అన్ని మతములు ఒక్కటే. ఏ మతమైనా దివ్యజీవనమును బోధించును. అన్నిటినీ ప్రేమించుము. అన్నిటికీ సేవ చేయుము. అహింసను, సత్యమును ఆచరించుము. బ్రహ్మచర్యమును పాటించుము. నిస్వార్థముగా ఉండుము. చావు పుట్టుకలు లేని అమరత్వము పొందును.

**మతము యొక్క అంతరార్థము :-** దైవమే ప్రేమ. నిజమైన మతం ప్రేమనందించేది, హృదయమును పంచేది. నీ గురించి నీవు భావించుకున్నట్లుగనే, ఇతరుల గురించి భావించుము. ఇట్టి విశ్వమతమే ప్రపంచ శాంతిని, ఆనందమును అందించును.

**ఓం తత్సత్. లోకా స్సమస్తా స్సుఖినోభవంతు**

✶

**ఆర్తులకు, బీదలకు, రోగగ్రస్తులకు సేవచెయ్యి. దుఃఖంతో దురవస్థలో ఉన్న వారికి సహాయపడు. పక్షులకు జంతువులకు సేవ చెయ్యి. సహృదయతతో ప్రేమతో సేవించు. మానవ సేవే మాధవ సేవ. ఇంతకంటే గొప్ప మతం లేదు.**

✶ ✶ ✶

**భగవంతుడు ఒక్కడే. ఆయన నామరూపాలు అనంతం. నీ ఇష్టం వచ్చినట్లు ఆయన్ను పిలిచి, పూజించు. నీకు తప్పక భగవద్దర్శనం కలుగుతుంది. భగవదనుగ్రహానికి పాత్రుడివి అవుతావు.**

- స్వామి శివానంద

మంచి పనులు వెంటనే చేయి, కాలం నీకోసం ఆగదు

భాగవత భారతి

# నారాయణీయ సంక్షిప్త వివరణము

*(గత సంచిక తరువాయి)* **- శ్రీమతి హేమలతా బాలసుబ్రహ్మణ్యం**

**31) త్రివిక్రమరూపము -** అప్పుడా బలి చక్రవర్తి వామనమూర్తిని చూచి "నీకేమి కావలయునో దానినంతటిని కోరుకొను" మని చెప్పగా అప్పుడా వామనుడు తనకు మూడడుగులు గల మట్టి (భూమి) చాలు నని చెప్పగా అదే సమయములో అసురగురువగు శుక్రాచార్యులు యాచకుడుగా వచ్చినవాడు శ్రీమహావిష్ణువే యని బలికి తెలియచేసినను ఆడిన మాట తప్పనటువంటి అసురేంద్రుడు నీవడిగిన పాదత్రయ భూమిని ఇచ్చితినని చెప్పగా ఆ వామనమూర్తి తన చిన్న పాదములతో ఇంతింత పెరిగినవాడై ఆకాశమును భూమిని రెండడుగులతో ఆక్రమించి మూడవ అడుగును ఎచ్చట నుంచవలెనని యడుగగా తన శిరము మీద నుంచమని చక్రవర్తి చెప్పగా వామనుడలాగేయని తన తృతీయ అడుగును అతని శిరస్సుపై నుంచి అతనిని వధించక పాతాళమునకు అణగద్రొక్కెను. మరియు అతనిని పాతాళమునకు చక్రవర్తిగా చేసెను. ఆతనిని ఎందుకు వధించలేదనగా ప్రహ్లాద వంశములో (అనగా హిరణ్యాక్ష, హిరణ్యకశిపులనంతరము) ఎవరిని వధించనని ప్రహ్లాదునికి విష్ణువు వాక్కిచ్చి నందువలన బలిని వధించలేదు. అందువలననే ఆ వంశములో జన్మించిన బలిచక్రవర్తి కూడ సప్త చిరంజీవులలో ఒక్కడై అతని శిరస్సు మీద శ్రీహరి పాదస్పర్శనము కలిగినందువలన కీర్తిమంతుడై ఇప్పటికిని చిరంజీవియై వర్ధిల్లుచున్నాడు.

**32) మత్స్యావతారము -** ఒకప్పుడు ద్రవిడ దేశాధిపతియైన సత్యవ్రతుడు నదిలో స్నానమాచరించుచుండగా ఆ రాజు యొక్క కరపుటమునందు భగవంతుడు మత్స్యావతారమును దాల్చగా అప్పుడు మహాప్రళయము సంభవించెను. అప్పుడామత్స్యమూర్తి మహామత్స్యరూపము దాల్చి రాజును ప్రజలను ఆ ప్రళయ జలము నుండి రక్షించుటకొఱకు భూమిని ఓడగాచేసి తన కొమ్ములలో ఆ ఓడను బిగించి కట్టి ఆ మహాజలములో ఈదుకొంటూ నవయుగమును గూర్చి పయనించెను. అదేసమయములో చతుర్ముఖ బ్రహ్మ యొక్క కర చతుష్టయము నుండి చతుర్వేదములను హయగ్రీవుడనే అసురుడు హరించి పారి పోవుచుండగా మత్స్యమూర్తి తన కొమ్ముతో అతనిని వధించి వేదములను సృష్టికర్మలను నిర్వర్తించుటకు సృష్టికర్తకందించెను.

సమయాన్ని సఫలం చేసుకునే వారు వివేకవంతులు

**33) అంబరీషోపాఖ్యానము –** అంబరీషుడనే చక్రవర్తి సర్వదా విష్ణు నామస్మరణము చేయుచూ ఆయన పాదములనే శరణుజొచ్చినవాడై ఏకాదశ్యాది వ్రతములు చేయుచు రాజ్యమేలు చుండగా భగవంతుడతని భక్తికి మెచ్చి, తన సుదర్శన చక్రమును అతనికివ్వగా ఆ రాజు ఆ చక్రమును భక్తి శ్రద్ధలతో సేవించుచుండగా ఒక నాడు ఏకాదశి వ్రతమాచరించి మరుదినము ద్వాదశి పారణము చేయుటకు ఉద్యుక్తుడై యుండగా ఆ సమయములో దుర్వాస మహర్షి తన శిష్యబృందముతో ఆలస్యముగా అచ్చటికి వచ్చి తాను స్నానమాచరించి వచ్చెదనినియు అంతవరకు వేచివుండమని చెప్పి వెళ్ళగా ద్వాదశి ఘడియలు సమీపించుచున్నందువలన పురోహితులు, పండితులు తీర్థపానీయము చేసిన దోషములేదని చెప్పగా రాజు తీర్థపానము చేయుచుండగా శిష్యసమేతుడైన మహర్షి రాజును సమీపించి ఆయన తీర్థపానముచేసి పారణమును ముగించివాడని తెలుసుకొని కృత్య యను ఒక దుష్ట శక్తిని సృష్టించి రాజు పైకి పంపగా అప్పుడు రాజువద్ద నున్న సుదర్శనచక్రము ఆ శక్తిని దహించి మహర్షిని తరుముచుండగా ఆ మహర్షి త్రిమూర్తుల రక్షణము కోరగా వారు అంబరీషునిచే శరణుపొందమనగా చిట్ట చివరకు మహర్షి రాజునే శరణుకోరగా అప్పుడారాజు సుదర్శనమును స్తుతించగా ఆ చక్రము శాంతించెను. అప్పుడా దుర్వాస మహర్షి రాజుకు భగవంతుని యందుగల అటలమైన భక్తిని చూచి ఆశ్చర్యమునొంది, అతనిని ఆశీర్వదించి నిష్క్రమించెను.

**34) శ్రీరామచరితము (ప్రథమ భాగము) –** దేవతల ప్రార్థనలను విని భగవంతుడైన శ్రీ మహావిష్ణువు శంఖ, చక్రశేషులతో సహ దశరథుని భార్యాత్రయమునందు రామ, లక్ష్మణ, భరత, శతృఘ్నులుగా అవతరించి పెరిగి పెద్ద వాడైన తరువాత కౌశిక మఖసంరక్షణార్థము ఆయననుసరించి తాటకను వధించి మిథిలకు మునితో వెళ్ళి శివధనుర్భంగముగావించి సీతను వివాహమాడి మధ్యలో తారసిల్లిన భార్గవ రామునికి తన నిజస్థితిని తెలిపి పునః అయోధ్యకు రాగా తండ్రియైన దశరథుడు (భగవదవతారమైన) రామునికి పట్టాభిషేకము చేయుటకు తీర్మానించగా పినతల్లి యైన కైకేయీ వరద్వయమువలన రాముడు సీతాలక్ష్మణులతో సహకాననమునకేగ ఆ సమయములోనే దశరథుడు మరణించగా అదే సమయములో మార్గమధ్యములో గంగానదిని దాటుట కొఱకు గుహుని స్నేహమును రాముడు పొందగా ఆయన వారి ముగ్గురిని నదిని దాటించి చిత్రకూటమను ప్రదేశమునకు చేర్చగా ఇంతలో అయోధ్యలో జరిగిన వృత్తాంతమంతయు తెలుసుకున్న భరతుడు సపరివారముగా సోదరుని సమీపమునకు వెళ్ళి తండ్రి మరణవార్తను తెలిపి తిరిగివచ్చి రాజ్యమును స్వీకరింపుమని ప్రార్థించగా రాముడు పితృవాక్య పరిపాలనార్థము భరతుని కోరికను నిరాకరించి తన

**మనసుని అణచకు, మార్చుకో**

గాంధీ

పాదుకులనిచ్చి దీవించి పంపగా తరువాత రాముడు తండ్రికి తిలోదకములనిచ్చి పంచవటికి వెళ్ళి అచ్చట కొంతకాలముండగా ఆ సమయములో రావణుని సోదరియైన శూర్పణఖ రాముని పొందుటకు ప్రయత్నించగా లక్ష్మణుడు ఆమెను అంగభంగముచేయగా ఆమె తన సోదరుడైన రావణునితో చెప్పగా రావణుడు మారీచుని స్వర్ణ లేడిగా మారి సీత ఎదుట సంచరిస్తూ ఆమె ఆకర్షింపుమని ఆజ్ఞాపించగా అతడలాగే తిరుగుచు ఆమెను ఆకర్షితురాలుగ చేయగా సీత రామునితో ఆ లేడిని పట్టి తెమ్మని ఆడుగగా రాముడు సీత కోరికను అనుసరించి దానిని తరుముకొని వెళ్ళగా కొంతసేపటికి మారీచుని మాయా క్రందనమును విన్న సీత లక్ష్మణుని రాముని సహాయము కొఱకు పంపగా లక్ష్మణుడు కూడ సోదరుని వెతుకుకొంటూ వెళ్ళగా అలా ఎవ్వరులేని సమయములో దశకంఠుడైన రావణుడు సన్యాసి వేషధారియై సీతను చెఱపట్టి లంకకు ఆకాశమార్గములో తీసుకొని వెళ్ళుచుండగా దశరథుని మిత్రుడైన జటాయువనే పక్షి అతనితో పోరాడుచుండగా రావణుడు పక్షి యొక్క పక్షద్వయమును ఖండించగా అది క్రింద పడిపోగా ఆ సమయమున అదే దారిలో రామలక్ష్మణులు సీతను వెదుకుచూ వచ్చుచుండగా మరణావస్థలో నున్న జటాయువు వారికి సీతావృత్తాంతమునంతయు తెలిపి ప్రాణములను వదలగా అప్పుడా రాముడు దానికి  దహన సంస్కారములు మోక్షప్రదానము చేసి పిమ్మట కబంధుడనే రాక్షసుని సంహరించి శబరికి మోక్షమునిచ్చి అంతిమముగా వాతాత్మజుడైన హనుమంతుని కలిసెను.

**35) శ్రీరామచరితము (ద్వితీయ భాగము) –** ఇలా హనుమంతుని సహాయముతో సుగ్రీవ మైత్రిని పొంది వాలిని హతమార్చి సుగ్రీవుని వ్యసనమును పోగొట్టగా సగ్రీవుని ఆజ్ఞతో హనుమంతుని నేతృత్వముతో సీతాన్వేషణము కొరకు దిక్చతుష్టమంతయు కపివరులు వెదుకుచుండగా సంపాతి దర్శనము, వచనములచేతను జానకి జాడను తెలుసుకున్న వానరులు సముద్రలంఘనము చేయుటలో హనుమంతుడే గొప్పవాడని యెంచి ఆయనను స్తుతించి పంపుటకు నిశ్చయించగా హనుమంతుడు శ్రీరాముడిచ్చిన ఆంగుళీయకముతో సహ అఖండదీప సదృశయైన సీతాదేవి దర్శించి ఆమె నుండి చూడామణిని గ్రహించి లంకాదహనముగావించి “చూచితిని సీతను” అని చెప్పుచు రాముని పాదాక్రాంతుడుకాగా అదే సమయములో రామపాదక్రాంతుడైన రావణ భ్రాతుతయగు విభీషణునికి శ్రీరాముడు అభయప్రదానమివ్వగా అటు తరువాత వానరులందరి సహాయముతో శతయోజన విస్తీర్ణమైన సాగరముపై సేతుబంధనమొన్చగా ఆ వంతెన మీదుగా అందరు నడచి లంకకు చేరగా వెంటనే రావణుడు యుద్ధమును ప్రకటించగా ఆ యుద్ధములో రావణ కుమారుడైన ఇంద్రజిత్ రామలక్ష్మణులను నాగపాశబద్ధులను చేయగా అప్పుడు గరుత్మంతుడు ఆ బంధమునుండి వారిని విడిపించెను. అటు తరువాత ఇంద్రజిత్ శక్త్యాయుధముతో లక్ష్మణుని బంధించగా హనుమంతుడు సంజీవ

**విజయాన్ని ధనంతో కొనలేము - నిరంతర కృషితో సాధించగలము**

నౌషధముతో అతని మూర్ఛను తొలగించగా పిమ్మట మాయావియైన ఇంద్రజిత్ కుంభకర్ణాది రాక్షస వీరులను హతమార్చి ఇంద్రదత్తమైన రథమునారోహించి రావణ వధము గావించి దేవతలందరు స్తుతింపగా లోకనిందకు వెఱచి సీతను అగ్ని శుద్ధను గావించి పుష్పకవిమానము ద్వారా అయోధ్యకేతెంచి దశరథ రాముడు పట్టాభిషిక్తుడై 10 వేల (11 వేల) సం॥లు రాజ్యపరిపాలన చేయుచుండగా ఒకనాడు దుర్మార్గుడైన ఒక పౌరజనుని మాటలు విని గర్భిణియైన సీతను వనములకు పంపగా ఆమెకు వాల్మీకి మహర్షి శరణము నివ్వగా ఆ ఆశ్రమమునందే లవకుశులనే కుమారులు జన్మించగా వారికి మహర్షియే సమస్త విద్యలను నేర్పి రామాయణ గాథను కూడ గాన రూపముగా నేర్పించగా వారు రాముడు నిర్వహించే అశ్వమేధ యజ్ఞశాలలో పాడగా అప్పుడచ్చటికి వచ్చిన వాల్మీకి మహర్షి వారిని గూర్చిన వివరములు సీత యొక్క పారిశుద్ధ్యమును తెలుపగా రాముడప్పుడు ఆమెను స్వీకరించుటకు రాగా భూమిజయైన సీత పుత్రులను రామునికర్పించి తన కుమార ద్వయమునకు పట్టముగట్టి సోదరులతో సహ పురజనులందరు చూచుచుండగా సరయూనదిలో ప్రవేశించి ఆనందధామమగు వైకుంఠమును చేరెను.

**36) శ్రీ పరశురామావతారము, శ్రీ దత్తావతారము) –** తరువాత ఆ వైష్ణవతేజము అత్రి అనసూయా దంపతులకు దత్తుడనే పేరుగల దత్తాత్రేయుడుగా జన్మించెను. తరవాత రేణుకా జమదగ్నులకు పరశురాముడనే నామధేయముతో జన్మించి వర్ధిల్లుచుండగా ఒకనాడు తల్లియైన రేణుక ఆకాశగామియైన ఒక గంధర్వుని చూచి ఆకర్షితురాలు కాగా తండ్రియైన జమదగ్ని ఆమెను వధించుమని పుత్రునికి చెప్పగా తండ్రి ఆజ్ఞను వెంటనే నెరవేర్చగా తండ్రి సంతసించి ఏదైన వరము కోరుకొనుమని చెప్పగా తల్లిని బ్రతికింపుమని కోరగా తండ్రి అతని కోరికను నెరవేర్చెను. తరువాత కోటి తపఃఫలముగా శివుని మెప్పించి ఆయన వద్దనుండి "పరశు" అనే ఆయుధమును పొంది దేవపశువైన కామధేనువును తండ్రి కొరకు తెచ్చెను. దానిని కార్త వీర్యార్జునుడు అపహరించగా శివప్రసాదితమైన పరశువుతో పోరాడుచుండ విష్ణుప్రసాదితమైన సుదర్శనము సహస్రబాహువైన కార్త వీర్యుని రక్షించుచుండగా ఒకప్పుడు దశకంఠుడైన రావణునే జయించిన ఆ కార్తవీర్యుని పరశురాముడు సంహరించెను. అప్పుడా కార్తవీర్యుని కుమారులు అతిక్రోధముతో పరశురాముని తండ్రియైన జమదగ్నిని వధించిరి. అప్పుడతని తల్లియైన రేణుకాదేవి హృదయవిదారకముగా 21 మార్లు గుండెను బాదుకొనుచు రోదించుచుండగా అది చూచి పరశురాముడు ఈ చతుర్దశ భువనములను క్షత్రియ రహితము గావించెదని ప్రతిజ్ఞచేసి సమస్త దిక్కులందుగల బ్రహ్మద్వేషులైన రాజులనందరిని తన పరశు వుతో సంహరించి వారి రక్తముతో శమంతపంచకమను చోట తర్పణమొనర్చెను.

*(సశేషం)*

**మధుర స్వభావులే మహానుభావులు**

# బతుకమ్మా ! బతుకమ్మా !

*(గత సంచిక తరువాయి)* - ఆచార్య కసిరెడ్డి

**బతుకిచ్చింది బతుకమ్మ**
**బతుకు నేర్పింది బతుకమ్మ**
**నేను బతుకుతా ! నీవు బతుకు అన్నది బతుకమ్మ**
**ఇది బతుకమ్మ ప్రకృతి**
**ఇది తెలంగాణ సంస్కృతి**
**ధరచోళ దేశాన ఉయ్యాలో**
**ధర్మాంగుడనురాజు ఉయ్యాలో**

అనే బతుకమ్మ పాటలో బతుకమ్మ పుట్టుపూర్వోత్తరాలున్నాయి. శ్రీలక్ష్మియే బతుకమ్మ అనీ, ప్రతియింటా శ్రీలక్ష్మి (వైభవం, సంపద, ధనం, ధాన్యం, సంతానం, సౌభాగ్యం) ఉండాలనీ ఈ పాట పరమార్థం. ఆ ఉయ్యాల పాటలోని కథనం చూద్దాం !

"చోళ దేశాన్ని ధర్మాంగుడనే రాజు పరిపాలిస్తున్నాడు. అతని భార్య సత్యవతి. వారికి నూరు మంది సంతానం. వారందరూ రాజ్యరక్షణలో శత్రువుల చేతిలో మరణించారు. దేశం పోయింది ; రాజ్యం పోయింది ; ఆ దంపతులు చింతించారు ; విచార సాగరంలో మునిగిపోయారు. దుఃఖంలో ఉన్నా చివరికొక నిర్ణయం తీసుకొన్నారు.

లక్ష్మీదేవిని గూర్చి సత్యవతి తపస్సు చేసింది. ఆ తల్లి ప్రత్యక్షమయి వరం కోరుకొమ్మన్నది. సత్యవతి లక్ష్మీ దేవికి దండం పెట్టి తన గర్భాన జన్మించుమని కోరుకొన్నది. ఇంకేం ఆ తల్లి దయదలచింది ; వరిమిచ్చింది ; సత్యవతి గర్భాన జన్మించింది. ఆ తల్లిని చూడ్డానికి మునులు వచ్చారు. కవులు, గాయకులు వచ్చారు ? ఆ పాపను చూచి "బ్రతుకుగనె ఈ తల్లీ చందమామ బ్రతుకమ్మ" అన్నారు. ఇక అప్పటి నుండి ఆ పేరుతోనే తల్లిదండ్రులు పిలిచారు; అందరూ పిలిచారు.

శ్రీమహావిష్ణువు చక్రాంకుడునే పేర జన్మించాడు. ఆ రాజు ఇంటికి ఇల్లరికం వచ్చాడు. బతుకమ్మను పెళ్ళి చేసికొన్నాడు. వారికి ఆరు వేల మంది సుందరాంగులు జన్మించారు. సత్యవతీ ధర్మాంగులు సంతసించారు" (తెలంగాణ పల్లె పాటలు, సం: బి. రామరాజు).

మంచితనాన్ని మించిన సంపద లేదు

శ్రీమహాలక్ష్మీ బ్రతుకమ్మ అన్నా, దానికి ఆధారం పై కథ (పాట) అయినా, పుసుపు ముద్దను గౌరమ్మగా భావించి (గౌరమ్మగాచేసి), బతుకమ్మ పూల గోపురంలో పెట్టి, బతుకమ్మయే గౌరీదేవిగా, పార్వతీగా సంభావించి పండుగ జరుపుకునే సంప్రదాయముంది. అందువల్ల బ్రతుకమ్మ అంటే జగజ్జనని పార్వతి అమ్మవారనే నమ్మకమూ ఉంది.

అంతేగాక లక్ష్మీ పార్వతీ సరస్వతీ దేవతల త్రిమూర్త్యాత్మక స్వరూప బ్రతుకమ్మ అనీ తెలంగాణలో బహుళ ప్రచారంలో ఉన్న ఈ క్రింది పాట ద్వారా తెలుస్తున్నది.

**శ్రీలక్ష్మి నీ మహిమలూ గౌరమ్మ**
**చిత్రమై తోచునమ్మా**
**భారతీ సతివయ్యు బ్రహ్మకిల్లాలివై**
**పార్వతీ దేవివై పరమేశు రాణివై**
**పరగ శ్రీలక్ష్మివయ్యా గౌరమ్మ**
**భార్యవైతివి హరికినీ . . . . .**

లక్ష్మీ పార్వతులే కాక సరస్వతి కూడా బతుకమ్మే అనే విశ్వాసం పెంచింది ఈ పాటనే. ఆ జగన్మాతే బతుకమ్మ. ముగురమ్మల మూలపుటమ్మ అనే భావన ఏర్పడింది.

మరొక విషయం కూడా జతపడింది. అది కాకతీయరాజుల ఇలవేల్పునకు సంబంధించినది. కాకతీయ రాజుల పూర్వీకుల్లో గుండన ఒకరు. ఆ గుండన పొలం దున్నుతుంటే ఓ దేవతా విగ్రహం లభించింది. గుమ్మడి తోటలో దొరికిన ఆ దివ్యమాతయే కాకతి. సంస్కృతంలో గుమ్మడిని కాకతి అంటారు. బతుకమ్మను గుమ్మడి పువ్వులతో పూజిస్తారు. కాళిక రూపంలో ఉన్న కాకతి కూడా గుమ్మడి పువ్వులతో పూజిస్తారు. ఈ బంధంతో కాకతే బతుకమ్మగా పూజింబడుతూ వచ్చింది

ఇలా శ్రీమహాలక్ష్మి, పార్వతి, సరస్వతి, కాకతి దేవతల సమాహార స్వరూపంగా బతుకమ్మ స్థిరపడి తెలంగాణలో ఆశ్వీజ శుద్ధపాడ్యమికి ఒకరోజు ముందు నుండి నవమి వరకు నవరాత్రి ఉత్సవాలు జరుపుకొంటున్నది.

దేశమంతటా దేవీనవరాత్రి ఉత్సవాలు జరుపుకొంటుంటే, వాటితో పాటు దేవీ ఉత్సవాలలో అంతర్భాగంగా బతుకమ్మ పండుగ దివ్యంగా, భవ్యంగా సుందరంగా, శోభాయమానంగా తెలంగాణలో జరుగుతున్నది.

బతుకమ్మ ఉత్సవాల్ని పరిశీలించిన సామాజిక శాస్త్రవేత్తలు ఇది మాత్రా రాధనంలో అంతర్భాగమే అంటున్నారు. అనంతమైన భారతీయ ఆరాధనా వ్యవస్థను పరిశీలించినప్పుడు

**సేవించకు మద్యం - జీవితాన్ని చేయునది ఛిద్రం**

ఆత్మారాధనం, భూతారాధనం, ప్రాఙ్మానవ దేవతారాధనం, మాత్రారాధనం, చివరిదైన సర్వదేవతారాధనం తదితర అంశాలెన్నో చర్చించబడినట్లు తెలుస్తుంది. దేవతల విషయంలో కూడా ఈ శాస్త్రవేత్తలు మాతృస్వామ్య పితృస్వామ్య వ్యవస్థను పరిశీలనలోకి తీసుకొన్నారు. కాని నేనొక్కడినే బహురూపాలతో కనిపిస్తాను అన్న గీతాచార్యుల వాక్కే సమాదరణీయమైంది. అంతటా భగవంతుణ్ణి చూడాలన్న వేదాంతుల మాటననుసరిస్తే తెలంగాణ ప్రజలు బ్రతుకమ్మలో దైవాన్ని దర్శించారు.

ఈ దర్శనం కారణంగానే ఎన్నో బతుకమ్మ పాటలు ప్రాదుర్భవించాయి. నిత్యజీవితంలోని సంఘటనలూ పాటల్లో కనిపిస్తాయి. పౌరాణికాంశాల్లోను ప్రస్తుత కుటుంబ జీవన సంఘటనలూ చొచ్చుకొని వచ్చాయి. పౌరాణిక చారిత్రక, స్థానిక, సామాజికాంశాలనెన్నో ఈ పాటలు ప్రతిబింబించాయి.

1) కష్టాలు కడతేర్చే దైవమహిమలు

2) దానధర్మాలు చేసిన వ్యక్తులు

3) పురాణాల్లోని సీత పుట్టుక వంటి సంఘటనలు, సీతారాములు వనగుంతలు (వామన గుంతలు), సీతమ్మ బైకలు, పర్ణశాల, సీతాపహరణం, మాయ లేడి .... ఇలా ఎన్నో

4) త్యాగశౌర్యాలు ప్రదర్శించిన వారి జీవితాలు

5) జనగామ/జడ్చర్ల వంటి రైలు ప్రమాదాలు

6) అత్యాచారానికి గురైన నక్క అండాలమ్మ వంటి వారి కథలు

7) అత్త ఆరళ్లకు బలి అయిన బ్రతుకులు

8) వ్రతకథలు ; పతి వ్రతల కథలు

9) ఇలవేల్పుల కథలు

10) షణ్మతాలకు సంబంధించిన కథలు

11) దేశ స్వాతంత్ర్యంలోని ఘట్టాలు

12) ఇందిరా గాంధీ హత్యవంటి సంఘటనలు

13) నిజాం/రజాకర్ల దురంతాలు

14) దుబాయి - మస్కట్లలో మోసపోయిన వారి కథలు

15) స్థానిక దేవాలయాలకు సంబంధించిన అంశాలు

16) కుటుంబ సంబంధి సరసాలు/విరసాలు

**ఎక్కువ కోరికలే సమస్యలకు మూలం**

17) స్త్రీల ఆత్మహత్యలు – పురుషులు

18) దేశ భక్తుల జీవితాలు

19) కల్లు సారా త్రాగడంవల్ల పాడైన కుటుంబాల కథలు

20) నైతిక విలువల ప్రబోధాలు

ఇలా ఎన్నో ఇతి వృత్తాలను పాటల నిర్మాణానికి జానపదులు స్వీకరించారు. తెలంగాణా ఉదాత్త వైవిధ్యభరిత జీవితాన్ని పాటల్లో నింపారు.

బతుకమ్మ ఉయ్యాల పాటలకు ప్రధానంగా ఖండగతినే స్వీకరించారు. ఒక ద్విపద పాదాన్ని మధ్యకు విరిచి పాడుకొంటే రెండు ఉయ్యాల పదాలవుతాయి.

దీనిని శ్రీరామ జయరామ ఉయ్యాలో/శ్రీ సీతారామ ఉయ్యాలో అని పాడుకోవాలి. ప్రధానంగా ఈ గతే బ్రతుకమ్మ పాటల్లో కనిపిస్తుంది. ఉయ్యాలోకు మారుగా వలలో, గౌరమ్మ, చందమామ అనే ఆవృత పదాలను పాద పాదానికి చేర్చి చెప్పుకోవడమూ ఉంది. కాని ఉయ్యాలో పదమే ఎక్కువగా ఉపయోగంలో ఉంది. చివరి అక్షరం హ్రస్వమనుకొంటే (ఉయ్యాలో = IIIII మాత్రలు) ఇది కూడా ఖండగతే అవుతుంది. ఏదియేమైన జానపదం దేశిసాహిత్యానికి ద్విపదమాతృక అయిందనే చెప్పాలి.

బతుకమ్మ ఒక సామూహిక ఉత్సవం. వృత్తి వర్ణ వర్గ కుల ప్రాంత మత సంప్రదాయ భేదాలకతీతంగా జాతిలో సమతాభావాన్ని పెంపొందించింది. ప్రకృతిలో లభించిన వివిధ పుష్పాలనొక చోటచేర్చి పూలగోపురం నిర్మించిన విధంగానే, రంగు–రూపు–వృత్తి భేదాలతో కనిపించే అందరినీ (ముఖ్యంగా మహిళలను) ఒకచోట చేర్చిన ఘనత ఈ ఉత్సవానికున్నది.

బతుకమ్మను ఆయా రోజుల్లో బావిలో వేసినా, లేదా చివరిరోజే అందరూ సామూహికంగా ఆడిన ఆట–పాటల అనంతరం వేసినా, బ్రతుకమ్మ అందించిన సందేశం పచ్చగ బ్రతకాలనే. నిమజ్జనం ఇచ్చే సందేశం కూడా ఎంత పచ్చగ బతికామో, అంత ప్రశాంతంగా వెళ్ళిపోవాలనే. జీవితం శాశ్వతం కాదు, పై నుండి పిలుపు వచ్చినప్పుడు అన్నిటినీ తృణప్రాయంగా విసర్జించి వెళ్లిపోవాల్సిందే.

వచ్చే సంవత్సరం మళ్లీ బ్రతుకమ్మ వస్తుంది కదా! అదే పునర్జన్మ ఉందనే ఆశావాదం నింపి పోవడం! బతుకమ్మ పచ్చగా బ్రతుకుమంటుంది. మరి ఏటా ఈ పండుగలో పాల్గొందాం! పచ్చగా బ్రతుకుదాం! పక్కవాడు కూడా పచ్చగా ఉండాలని జీవిద్దాం!!

✶

**అసాధ్యాన్ని సుసాధ్యం చేయుటయే ఉత్తమ లక్షణం**

# PURPOSE AND GOAL OF LIFE

- Swami Chidananda

Radiant Immortal Atman! Beloved children of the Divine!

May the Divine Grace of the Lord shower upon you all this moment! May the Lord grant you good health and long life and bless you with prosperity and success!

The great sages of the ancient times have told us that we are having our source and origin in an eternal, cosmic and infinite source of everlasting Existence, whom we call God. That is our eternal abode. We are here temporarily in a state of separation from God, and in this state of temporary separation, we have forgotten our eternal connection and relationship with Him.

One must reflect upon this, "From where did I come? Why am I here? what is my destination? What am I? Who am I? What is the meaning and purpose of this life?"

The individual has no real satisfaction and contentment here, because finite and temporary things cannot satisfy te eternal spirit in us. Our real is nature is divine and imperishable. You are not this perishable cage of flesh and bones. Your are not ihe impure restless mind. You are not this finite, limited intellect. Beyond and distinct from body, and intellect, you are eternal spirtit. Unborn, permanent, deathless imperishable, and endless, ever-pure ever and perfect Atman, part and parcel of the Cosmic Being, inseparably related to God.

God is peace. God is supreme bliss. God is all-fullness and perfection. Forgetfulness of our relationship to God is the root cause of our misery and restlessness. To regain this connection and to become aware of our oneness with Him and thus become aware of our immortal nature that is your highest goal. In this lies your supreme welfare. Attainment of this experience is the real goal of life that is the inner spiritual purpose and existence.

**Speak a little and Sweetly**

You have not come here to go on living in a state of bondage of the senses. You have come here to Immortality. You have come here to obtain Divine Consciousness. You have come here to attain Supreme Blessedness by which you become liberated from the pains and miseries of earth life. This attainment is the goal of every human individual. Life is a gift of God, a golden chance given to obtain God-experience. All other things are secondary.

The individual being has got many obligations and duties to perform. All this is alright, but you must not commit a grave blunder. While these duties and obligations are part of your life, you have not taken birth only for them. All duties upon this earth plane are secondary duties. The primary and the highest duty is to attain God-experience, to attain the realisation of your own immortal nature. This is the central purpose of human existence. By this attainment alone, life becomes truly lived, by this alone life is truly successful. Therefore, this duty should never be forgotten.

To remind man of this great truth, the Universal Being sends His messengers again and again. Mankind has fallen into the sleep of forgetfulness. He is in a spiritual slumber forgetting his Goal. His life has taken him into a different direction, and he is full of grief, misery, bondage, fear, anxiety and pain. All these things are avoidable. All these things can be overcome by fulfilling your highest duty. All the great prophets, saints and mystics have again and again brought this message to mankind.

The Upanishads, the highest wisdom portion of the Vedas, called upon mankind, "Awake! Arise! Attain wisdom and become free!" This is a call to awakening. It is a call for sincere effort to attain the Goal. Be active upon the spiritual plane, and while fulfilling your duty, be alert and awake and be earnestly engaged in fulfilling the supreme duty. This is

**Reduce your wants lead a happy, contended life**

wisdom. The alone life becomes properly utilised Then alone you truly live.

If the spiritual goal is absent in your life, then life is no life. It is meaningless waste. It is a process of just whiling away time, and one day dying. Life, if it is merely physical and psychological, is no life at all. It is only polished animal life, it is only sophisticated sensual life.

Will you go empty-handed? is your life to serve no purpose? Will you go away without some permanent attainment? These questions have to be asked and answered.

You are divine Spirit. It is only when you are active upon the spiritual plane of your reality, you can say that you are living. This is the great call of the messengers of God. This is the central message of all scriptures in this world. All religions in human sociey exist in order to give a Godward direction to human life and bestow highest blessedness, to take you from sorrow to happiness, from bondage towards liberation.

Beloved children of the Divine ! Relaise the importance of living life spiritually. No matter where you are, meditated upon Him. It has not been no matter how you are living your life, lived at all. The outer form of your life should not lived in which the inner life. Your inner reality is purely spintual. Therefore, in the midst of your secular, social and professinal life, you must be up and doing in the spiritual life.

Day by day, you must progress towards God. That day is wasted, when you have not taken His Name and meditated upon Him. It has not been lived at all. Only that day has been lived in which you have turned your mind towards God, lifted your heart towards Him, thought about Him with love, praised Him, worshipped Him. Then only have you lived your life. This is real wisdom. Therefore, keep this inner stream of spiritual life alive, dynamic, progressive and continuous.

Hari Om Tat Sat!

**Never hurt the feelings of others, Be kind to all**

# MAHAAN SRIMAD APPAYYA DIKSHITAR

- Sivananda Muthuraman

SADASIVA SAMARAMBAM SANKARACHARYA MADYAMAM
ASMAD ACHARYA PARYANTHAM VANDE GURUPARAMPARAM.

I take pleasure in sharing with you all a short life history of the great Saivait Mahaan Srimad Appayya Dikshitar, who was born in the 16$^{th}$ century in this Punya Bhoomi Bharat Desh. His birth place is Adayapalem, a small village in the surroundings of Kanchipuram Kheshtram. Nearby Arani and Arcot district exist in the Tamil Nadu. Adayapalem, in those days was fully flooded with Sages, Saints, Yogis, several Mahatmas, Agnihotries, Veda, Sastra expert Pundits (MEDAVIS) and a host of pious people.

In the Adayapalem there lived an Erudite Sanskrit Scholar by name Brahmasri Rangaraja Dikshitar, a Sama Vedi (exponent of Sama Veda) who performed the rare 'VISWAJIT YAGA' by spending from his whole self owned properties. For a long time till the age of 40 years he had no issues (PUTRA BHAGYAM). He was very much worried and as per his elders' advice he moved from Adayapalam to Chidambaram Kheshtram, in Tamil Nadu (one of the Five Panchabhoota Sthala i.e. AKASA LINGA KHESHTRA and led a tapas life praying to Lord Siva in Nataraja form for His blessings. Lord Siva very much pleased with his penance led life blessed the couple. His wife conceived a year after they came to Chidambaram Kheshtram and became parents of two male children, and a female child.

The first child was named as VINAYAKA SUBRAHMANYAM, who later on was called affectionately as APPA by his Parents. (There was also another reason in those days that Seemanta Putra's (elder Son) name should not be called by their parents and only to be called by a nick or pet name). As he had grown up, the local village people called

**Think of the mistakes that you have made self analysis**

him as APPAYYA and then APPAYYA DIKSHITAR. The second child was named as ACHARYA DIKSHITAR (name of Appayya Dikshitar's grandfather, as it was customary those days to name the children with forefather's name). He also became a great Sanskrit Scholar. The third child was a female child and was named as GNANAMBIKAI.

At the age of seven Sri Appayya Dikshitar's Upanayanam was performed and he entered into the Brahmacharya Ashrama as per the Hindu religious custom. His father took him to Guru Rama Kavi to learn KAVYAM, DRAMA, ALAMKARAM, SAHITYAM and other related Arts. He was married to Mangalanayaki, daughter of Sri Srinivasa Dikshitar, who was the Asthana Vidwan in the Maharaja Soorappa Naicken Samsthnam. He was running Gurukula Patasala in which many number of sishyas came and studied. He regularly conducted Vedic, Sastra classes to the sishyas who thronged from various parts of India. His name was spread worldwide for his intelligence and wisdom and also for his in-depth knowledge in the Hindu Sanatana Dharma which he preached to sishyas.

When Sri Appayya Dikshitar was 16 years old, his father Brahmasri Rangaraja Dikshitar called the two Sons nearer to him and gave Upadesa. He informed them that "both have learnt well all the Arts. Do not develop any ego on your wisdom and intelligence. Always worship Lord Siva. Whoever appears with Vibhuti on their forehead and Rudraksha on their neck, think that they are the real swaroopa of Lord Siva and prostrate before them. Worship Lord Siva by performing Yagas and Yagnas", and breathed his last and attained Sivaloka Prapti.

H.H. Sri Swami Sivananda, Himalayan Yogi, hails from the hereditary line of this great Mahaan. He very often refers to him as an Amsavatara of Lord Siva in his spiritual books. In fact, his great grand fathers were also are of ardent devotees of Lord Siva earned worldwide recognition for their valuable services rendered to the Hindu Sanatana Dharma and by which scores of people got wisdom and salvation.

**Do not depend upon Servants. Have Self reliance**

During his life time of 73 years many miracles have happened in his life, also experienced by some people, which are compiled and made known to the public by various Saints, Sages and followers of Hinduism and also through their spiritual lectures. He led a grahastha life and dedicated his whole life time in propagating the Hindu Santana Dharma and for the upliftment of Hindu religion. He was blessed with three Sons and two Daughters.

Sri Appayya Dikshitar had written number of spiritual books, Sanskrit slokas, Stotras, poetries' etc., which are more than one hundred in numbers. His sacred works includes number of stotras in praise of Lord Siva, Lord Vishnu and other deities. Though a great Saivait Mahan, he worshipped Lord Vishnu also without any differentiation, because Lord Siva and Lord Vishnu are one and the same Go d as it is said that –

SIVAYA VISHNU ROOPAYA SIVAROOPAYA VISHNAVE
SIVASYA HRUDAYAM VISHNO: VISHNOSYA HRUDAYAM SIVA.

There are some Stotras, the recitation of which will mitigate serious problems faced by the human beings. People have seen personally many miracles happened during his pilgrimage tours. Some of his famous composed Stotrams are – 1. Atmarpana Stotram and 2. Margabandu Stotram.

Once when Appayya Dikshittar was passing through a dense forest, he lost the route to proceed ahead. At that time, bandits (robbers, adavidongas) on seeing him came nearer to him and wanted to snatch away his personal belongings. Appayya Dikshitar not knowing what to do at the moment wholeheartedly started reciting the MARGABANDU STOTRAM composed by him in praise of Lord Siva. When he was reciting, Lord Siva appeared before the robbers and pierced them with His TRISULA. Then Lord Siva guided Appayya Dikshitar and walked along with him till he reaches his destination and suddenly disappeared. This is a very powerful Stotram with five stanzas, recitation of which whole-

**Think of God as soon as you wake-up and when you go to Bed**

heartedly will protect us from the evil thinkers and will remove any sort of fear within us.

During his pilgrimage tour to Tirupathi Shrine to have darshan of Lord Venkateswara, the Archakas did not allow him because he was a Saivait Mahan. Those days there was a group of devotes with Siva Vishnu beda in worship. By his supernatural power he turned Vishnu roopa to a Siva roopa and worshipped. The Archakas astonished to see the Change in the roopa and prostrated before him and asked his kshamapana. They begged him to bring back to the original roopa of Lord Venkateswara, which he obliged.

On one day-break (Brahmamuhurtham time) Sri Appayya Dikshitar had a dream in which Lord Siva appeared and told him to write a grantham in detail for the "SRIKANTA BASHYAM". (We all know that Bhagwan Sri Veda Vyasa had written and presented Brahma Sutra, for which a great Sanskrit Scholar Sri Kantachariar wrote explanation and so it is called SRIKANTA BASHYAM").

The very next day when he went to Darbar Hall as usual, Maha Raja stood up and paid obeisance to Sri Appayya Dikshitar and asked him to write detailed comments on the "SRIKANTA BASHYAM" which will be a great service to our humanity. On hearing the Maha Raja's words, Sri Appayya Dikshitar was very much surprised and stunned, recollected yesterday's dream that he had, which has come true. He was very happy to complete the grantham and titled it as "SIVAARKAMANI DEEPIKA" and presented in the Raja Darbar. Maha Raja was immensely pleased and in Honour of his great service to the humanity, made him to sit in a Golden Simhasana and performed Kanakabhisheka (Kanakam means gold). Sri Appayya Dikshitar used these gold coins for the construction of a Siva Temple, named the deity as "SRI KALAKANTESWAR"and dedicated it to the devotees.

In his last days Sri Appayya Dikshitar was suffering with severe stomach pain. His stomach pain was disturbing his routine Siva Pooja.

**Have always a Japa - Mala on your Neck or in your Pocket**

So he took one Pooja Plate and filled it with water and in that water he placed a stone like material which was removed from his stomach. Then he continued the Siva Pooja without pain disturbance. His Sishyas questioned him when you are able to bring from stomach the stone like material and place it on a plate, can you not throw it out so that once for all the pain goes? Sri Apopayya Dikshitar answered to them that yes I can do it. But if I do it now, in the next janma it follows me and again I have to bear the pain. Hence I have to experience in this Janma itself the pain with Lord Siva's blessings and to remain patience.

He performed Soma Yagam, Jyotishta Yagam, Vajapeyadi Yagam and for which the Raja of Tanjore Sri Narasimha Boopala Verman personally participated and accompanied Appayya Dikshitar with holding the Pattu Umbralla over Sri Appayya Dikshitar's head which was considered as a great respect to Appayya Dikshitar shown by the Raja of Thanjavur.

During his life time of 73 Years, he had written number of Sanskrit Granthas, out of which 104 are confirmed available now. Some of which are – Siva Advaitha, various Stothras, Granthas concerning to Vedanta, Upanishads Saras, Mimasa Sastras, Alankara Stotras, Kavya Vyakyanam, Vyakarna Vyakyanam etc. Like Sri Swami Sivananda, Kanchi Seer Sri Chandrasekarandra Saraswathi Swamigal also said in one of his Satsanga Upadesa in Adayapalam that "during the prathasmarana I remember all Great Mahatmas and one among them is Sri Appayya Dikshitar". He led a very simple and pious life. He never thought at any time that he is a great scholar (VIDYA VINAYA SAMPANNOU). He had a special interest in doing Sri Rudra Parayanam. He once quoted from Kanchi Seer Maha Periaval's sayings on the SRI RUDRAM – "to take birth in a Yajur Veda family is a great boon because Sri Rudram is found in the middle of Yajur Veda. In the SRI RUDRAM the word "NAMA: SIVAYA" that is Panchakshara Mantra is available. This word SIVA is called JIVA RATNAM". Sri Swamii Sivananda also once said that Sri Appayya

**Adhere to the motto. "Simple living and high thinking"**

Dikshitar was a great Yogi, a great Siva Bhakta who possessed a genious mind and a great Sanskrit Scholar which none can deny.

In his last days, Sri Appayya Dkshitar lived in the Siva Kshetra Chidambaram. At the age of 73, he realized that his days are nearing to get Moksha. It was the day of CHAITRA POURNAMI morning hours. Sat in Darbasana; had called all his relatives, his two Sons, Sri Nilakanta Dikshitar his brother's grandson who is also a great Sanskrit Scholar and recited a Sanskrit sloka meaning "I have no desire to attain anything in this materialistic world and I only desire to attain the lotus feet of Lord SIVA". Siva Jyothi appeared in his eyes and in the middle of the Divine Jyothi Lord Nataraja in his dancing posture gave darshan to him, as per his last sloka recited by him. This sloka ended abruptly and he attained MUKTI. The rest of the sloka was completed by Sri Nilakanta Dikshitar, his brother's grandson. At the same time, the Archakas in the Temple while doing Mangala Harathi to Lord Nataraja saw Sri Appayya Dikshitar claiming the PANCHAKSHARA STEPS and entering the santum santoram and then disappeared and merged with the Lord.

Sri Appayya Dikshitar's Jayanthi which falls in the month of September every year is celebrated nationally and internationally by various Spiritual Organizations and Institutions to inculcate in the minds of people his valuable works done in propagating the Hindu Sanatana Dharma which was revived by the great Sri Adi Sankara about 2500 Years back. On this occasion, Vidvat Sadas and Spiritual lectures by the learned Pundits are also arranged. This year, Sri Appayya Dikshitar's Jayanthi being celebrated on 25th September, 2018 (Mangalvar) on the starting day of Mahalaya Paksha, by scores of his followers globally. Let us seek his holy blessings whole heartedly and be a true Sishya.

The phalasruthi says that those who remember, hear, read and spread his life history to other devotees are considered as blessed soul and will attain Siva Sayujya.

**HARIHI OM TATSAT** ✶

**Serve the Sadhus, Sanyasis, the Poor, the Sick and the Suffering**

**వికాస భారతి**

# విజయవంతమైన జీవితానికి ముఖ్యమైన సూత్రాలు

జీవితంలో ఏదైనా సాధించాలని, అందరూ అనుకొంటూంటారు. అనుకోవడం దగ్గరనే ఆగిపోకుండ, ఆచరణలో ముందుకు పోగలగడం ఎంతో అవసరం. సరైన ఆలోచనలతో ప్రణాళికాబద్ధంగా ప్రయత్నించడమే, విజయావకాశాలను మెరుగుపరుస్తుంది.

మనలో నిద్రాణంగా ఉన్న శక్తి సామర్థ్యాలను మేల్కొలిపి అర్థవంతమైన జీవితాన్ని జీవించాలి జీవించటానికి ఉపయోగపడే కొన్ని భావనలను గమనించండి.

**– జీవితం అంటే సమయమే ! జీవితంలో సమయం ఎంతో విలువైనది.** ప్రతిరోజూ, ప్రతి నిముషాన్ని సద్వినియోగం చేసుకోవడం అలవాటు చేసుకోండి. సమయాన్నే కాదు, దేనినీ వృథా పరచకండి. నిరంతర అభివృద్ధికి కావలసిన శక్తి, సామర్థ్యాలను సమీకరించుకోండి. అభివృద్ధి పరచుకోండి.

– మీరు ఎప్పుడూ **మంచి ఆలోచనలే చేస్తూ, ఉల్లాసంగా ఉత్సాహంగా ఉండండి. మానవతా విలువలను పాటించండి.** మంచి పనులనే చేస్తూ ఉండండి.

**– మీ జీవితానికి ఒక ధ్యేయాన్ని నిర్దుష్టంగా ఎన్నుకోండి.** సాధ్యాసాధ్యాలను పరిశీలించండి. ఉన్న అవకాశాలను గమనించండి. మీకున్న బలాలను గుర్తించి, మరింత అభివృద్ధి పరుచుకోండి. అవసరమైన కొత్తబలాలను సమీకరించుకోండి. ఉన్న బలహీనతలను అదుపు చేయండి. కొత్త బలహీనతలను ఆహ్వానించకండి. **ప్రణాళిక బద్ధంగా ముందడుగు వేయండి.** గమ్యంవైపు సాగిపోండి. అప్పుడప్పుడూ సమీక్షించుకోవడం మరుకవకండి.

– మీపై మీరు నమ్మకం కలిగి ఉండండి. **ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకుంటూ వుండండి. మీ ధ్యేయం మీ మంచినే కాక అందరి మేలుకోరేలా** ఉండటం మంచిదని గమనించండి. మీ కృషి మీ పై మీకు మరింత విశ్వాసాన్ని కలిగించేలా ఉండేటట్లు జాగ్రత్తపడండి. మీ ప్రయత్నాలు **"విజయవంతం అవుతాయి"** అన్న విశ్వాసంతో కృషి కొనసాగించండి.

***– ఆచార్య వంగపల్లి విశ్వనాథం గారి***

***"మీ మార్గం – మీ గమ్యం"*** *నుండి సేకరణ*

**సహనం సముద్రం కన్నా పెద్దది**

ప్రకటన భారతి

# దివ్యాంగులకు
# కృత్రిమ అవయవాల పంపిణి

శివానందాశ్రమంలో, ఆశ్రమం తరపున, శ్రీవత్స నృసింహ పాలపర్తి మోరంపూడి ఫౌండేషన్, సేవాభారతి సంయుక్త సహకారంతో పద్మారావునగర్, శివానంద ఆశ్రమంలో ఆగష్టు నెలలో దివ్యాంగులకు కృత్రిమ అవయవాల పంపిణి జరుగనున్నది.

బాలల నుండి వృద్ధులనక అవయవాలు కోల్పోయిన వారి జీవితం సజావుగా జరగడానికి పై కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. బెంగుళూరు రోటరి క్లబ్ ద్వారా ఉచితముగా ఇవ్వబడిన కృత్రిమ చేతులు (ఎన్.ఎన్-4 ప్రోస్థెటిక్ హాండ్స్, యుఎస్ఏ) పంపిణీ చేస్తారు.

సంప్రదించవలసిన నం. పి. రమేశ్,

**9652124066**

**ప్రతి నెల బుధవారం రోజు ఉచిత సంస్కృత క్లాసులు సా॥ 6 గం॥ల నుండి 8.00 గం॥ల వరకు జరుగుచున్నవి.**

సహనం సముద్రం కన్నా పెద్దది

# శ్రీ శివానంద ఆశ్రమ వార్తలు

## ● ఆశ్రమంలో శ్రీ లలితా అమ్మవారికి లక్ష పుష్పార్చన

ఆగష్టు 31వ తేదీన ఆశ్రమంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా శ్రీ లలితా అమ్మవారికి సామూహిక లక్ష పుష్పార్చన జరిగింది. దాదాపు వందమంది పై వరకు మహిళలు పాల్గొనార్ను. ఈ కార్యక్రమానంతరం ప్రసాద వితరణ చేశారు.

## ● ఆశ్రమంలో శ్రీకృష్ణ జయంతి

శ్రావణ బహుళాష్టమి సెప్టెంబర్ 3వ తేదీన శివానందాశ్రమం, సంస్కారభారతి కలిసి జమిలిగా శ్రీకృష్ణ జన్మాష్టమి కార్యక్రమం నిర్వహించింది. బాలకృష్ణ వేషధారులైన బాలాబాలికలకు (రాష్ట్రస్థాయి పోటీలలో గెలిచిన వారికి) బహుమతులందజేశారు. పాల్గొన్న వారి ఆటపాటలను చూచి అందరూ ఆనందించారు. బాలబాలికలు కాళియమర్దనము నృత్యనాటిక ప్రదర్శించారు.

ఆచార్య కసిరెడ్డి గారు కృష్ణ తత్త్వంపై ప్రసంగించారు. కృష్ణునిలా మన పిలల్ని ధర్మ రక్షకులుగా తీర్చిదిద్దాలన్నారు. సంస్కార భారతి అధ్యక్షులు శ్రీ సి.వి.ఎల్. నరసింహారావు, శ్రీ విఠల్ జోషి, మాతృమూర్తులు తదితరులు పాల్గొన్నారు. ప్రసాద వితరణతో కార్యక్రమం ముగిసింది.

## ● స్వామి శివానంద సరస్వతీ జయంత్యుత్సవం

2018 సెప్టెంబర్ 8వ తేదీన ఆశ్రమంలో 131వ జయంతి ఉత్సవం జరిగింది. ఆశ్రమంలో జరిగిన ఈ ఉత్సవంలో దివ్యజీవనతత్త్వ ప్రచారులు శ్రీ ఆళ్వార్ స్వామి ప్రసంగించారు. స్వామి శివానందుల వ్యక్తిత్వం, దివ్యజీవన తత్త్వం గురించి వివరించారు.

ఈ సందర్భంగా దివ్యాంగులకు చక్రిల కుర్చీలు, చేతి పరికరాలు, వాకర్లు, చేతులు ప్రదానం చేయడం జరిగింది. ఆశ్రమ పక్షంలో అధ్యక్షులు శ్రీ జి. సుధీర్ కుమార్‌గారు తదితరులు పాల్గొన్నారు.

● 2018 సెప్టెంబర్‌లో తత్త్వ విదానంద గారి ఆధ్వర్యంలో భగవద్గీత ప్రవచనాలు జరిగాయి.

● శ్రవణా నక్షత్రం పురస్కరించుకొని యోగ బాలాజీ మందిరంలో శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి కల్యాణం జరుగును.

● ప్రతి నెల మూడవ శనివారం రోజు భగవద్గీత (700 శ్లోకాలు) పారాయణం జరుగును.

**ఆవేశపూర్వక నిర్ణయాలు అనర్థాలను తెస్తాయి**

వార్తా భారతి

# స్వామి శివానంద మహారాజ్ జన్మ దిన వేడుక

సెప్టెంబర్ 8, 2018 – స్వామి శివానంద మహారాజ్ జన్మ దిన సందర్భంగా హైదరాబాద్ సమీపంలోని కూకట్‌పల్లిలో గల వసంత్‌నగర్ కాలనీలో శ్రీమతి దండు విజయలక్ష్మి గారి స్వగృహంలో సాయంకాలం 4–30 గంటలకు సత్సంగము జరిగినది. దీనిలో శివానంద లైబ్రేరీ, కాచిగూడ సభ్యులు మరియు వరంగల్ నుండి వచ్చిన శ్రీమతి, శ్రీ రామేశ్వర్‌గారు పాల్గొన్నారు. శ్రీమతి విజయలక్ష్మి గారి బంధుమిత్రులు ఎక్కువ సంఖ్యలో పాల్గొన్నారు.

శ్రీమతి విజయలక్ష్మి గారు పశ్చిమ గోదావరి జిల్లా వాస్తవ్యులైన కీర్తిశేషులు శ్రీ ఇందుకూరి రామమూర్తి రాజు మరియు శ్రీమతి సావిత్రమ్మ గార్ల కుమార్తె. 1907లో జన్మించిన రామమూర్తి గారు పరమపూజ్య శ్రీ శివానంద మహారాజ్ స్థాపించిన దివ్యజీవనం సంఘంలో మొదటి నుండి అనగా 1940 నుండి సభ్యుడుగా వుండి సంస్థకు ఎంతో సేవ నొనర్చిన మహానుభావులు. “సంసార ఋషి” గా పేరొందినవారు. ఎల్లప్పుడూ సత్యం, అహింసలను ఆచరించుకునేవారు.

సత్సంగ్‌లో మొదటగా విజయలక్ష్మి గారి కుటుంబ సభ్యులు గురుదేవ్ శ్రీ శివానంద స్వామి వారికి శ్రీ రామేశ్వర్ గారి సహకారంతో అర్చనగావించారు. తదుపరి ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఆచార్య శ్రీనివాస్ యోగ గురూజీ, ఆచార్య రమేష్ గురూజీ తమ సందేశాలను తెలిపారు. ఆచార్య శ్రీనివాస్ గురూజీ “అహం బ్రహ్మాస్మి” అనే మహావాక్యాన్ని అర్థం చేసుకొని సర్వంతర్యామి అయిన పరమాత్మ తత్వాన్ని సులభంగా తెలుసుకోవచ్చు అన్నారు.

ఆచార్య గురూజీ సంస్కృతి – సంప్రదాయాల గురించి మాట్లాడుతూ నేటి యువతరం ఈ విషయమై తీసుకోవలసిన జాగ్రత్తలను సూచించారు. సాధకులు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోడానికి ప్రాణాయామం, ధ్యానంపై శ్రద్ధ వహించాలని చెప్పారు. తేలికపాటి ఆసనాల గురించి ప్రదర్శన పూర్వకంగా విశదీకరించారు. శ్రీ తాడేపల్లి దాస్ గారు వారి తండ్రి గారు కీ॥శే॥ సుబ్రహ్మణ్యశాస్త్రి గారు రచించి, స్వరపరచిన లలితా దేవిపై కీర్తనలను ఆలపించారు. వారి మనుమరాలు కుమారి తుషార్ కూడ మూడు కీర్తనలను పాడి అందరిని సంతోషపరిచారు.

మనకు అవసరాలు గుర్తున్నంతగా సామర్థ్యాలు గుర్తుండవు

నేను ఈ సంవత్సరం కీ॥శే॥ సుబ్రహ్మణ్య శాస్త్రి గారి శతజయంతి కావడంవల్ల శ్రీ రాందాస్ గారి కుటుంబ సభ్యులందరు వారి కీర్తనలకు బహుళ ప్రచారం కావిస్తున్నారు.

ప్రసంగాలకు ముందుగా అతిథులందరు సామూహిక భజనలు, కీర్తనలు చేశారు. శ్రీమతి విజయలక్ష్మి గారు మాట్లాడుతూ తమ తండ్రి తమ కుటుంబ సభ్యులనే కాక సమాజంలోని తోటి వారిని ఏవిధంగా సన్మార్గంలో నడిపినది తెలియజేశారు.

చివరగా శాంతి మంత్రములు, విశ్వప్రార్థన పఠించి హారతి ఇవ్వడం జరిగింది. వచ్చిన భక్తులు శ్రీమతి విజయలక్ష్మి గారు ఇచ్చిన ఆతిథ్యాన్ని స్వీకరించి, సత్సంగ్ నిర్వహించినందుకు వారికి కృతజ్ఞతలు తెలియజేశారు.

**- ఎస్. వెంకటేశ్వరరావు**

**నీ పాఠాలతో పాటుగా భగవద్గీత,**
**మహాభారతం, రామాయణం, ఉపనిషత్తులు మొదలైన**
**పవిత్ర గ్రంథాలను కూడా అధ్యయనం చెయ్యి. వాటి**
**ద్వారా నువ్వు నేర్చుకున్న అంశాలను ఆచరణలో**
**పెట్టు. నీ ఆధ్యాత్మిక జీవనంలో**
**ముందడుగు వెయ్యగలవు.**

✶ ✶ ✶

**'నేను' అనే అహంకారము,**
**'నాది' అనే మమకారము,**
**అన్ని సమస్యలకు మూల కారణములు.**

ఆనందం వస్తువులతో ఉండదు - మనసులో ఉంటుంది

విశేష భారతి

శ్రీ విళంబి భాద్రపద బహుళ సప్తమి నుండి
ఆశ్వయుజ బహుళ సప్తమి వరకు

## అక్టోబర్ - 2018

| | |
|---|---|
| 02-10-2018 | భాద్రపద బ॥ 8 - గాంధీ జయంతి, శాస్త్రీ జయంతి |
| 08-10-2018 | భాద్రపద బ॥ 14 - ఆయుధాల చతుర్దశి |
| 09-10-2018 | భాద్రపద అమావాస్య - మహాలయ అమావాస్య |
| 10-10-2018 | ఆశ్వయుజ శుక్ల పాద్యమి, శరన్నవరాత్రులు ప్రారంభం |
| 11-10-2018 | ఆశ్వయుజ శుక్ల విదియ, లోకనాయక్ జయప్రకాశ్ నారాయణ్ జయంతి |
| 12-10-2018 | శుక్ల చవితి, భీమరథీ నది పుష్కరాలు ప్రారంభం - 12 రోజులు |
| 15-10-2018 | శుక్లషష్ఠి, సరస్వతీ పూజ |
| 17-10-2018 | దుర్గాష్టమి |
| 18-10-2018 | మహార్నవమి |
| 19-10-2018 | విజయ దశమి, శమీపూజ, శ్రీమధ్వాచార్య జయంతి |
| 24-10-2018 | ఆశ్వయుజ పూర్ణిమ - వాల్మీకి జయంతి |
| 28-10-2018 | ఆశ్వయుజ బహుళ చవితి, సోదరి నివేదిత జయంతి |
| 29-10-2018 | ఆశ్వయుజ బహుళ పంచమి, స్వాతికార్తె |
| 31-10-2018 | ఆశ్వయుజ బహుళ సప్తమి, సర్దార్‌వల్లభ భాయి పటేల్ జయంతి |

**నీ మాతాపితలు, గురువు, అతిథి ప్రత్యక్ష దైవాలు. బీదవారు కూడా కనిపించే దైవాలే. సృష్టిలోని సమస్త ప్రాణికోటి భగవంతుని రూపాలే. అందుకే అందరినీ ప్రేమించు, సేవించు, గౌరవించు.**

**Printed and Published by G. SUDHIR KUMAR on behalf of A.P. DIVINE LIFE SOCIETY, Printed at Natural Gray Offset Press, # 10-2-11/1, Opp. IDBI Quarters, I.T. Towers Road, AC Guards, Hyderabad - 500004, Published at A.P. DIVINE LIFE SOCIETY SIVANANDA ASHRAM 6-1-110, Padmaraonagar,** Secunderabad - 500 025 **Editor Acharya Kasireddy Venkat Reddy.**
Tel : 040-27503274

ముఖస్తుతి నచ్చే వారికి ఉత్తుత్తి మాటలతోనే కడుపు నిండుతుంది